ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

ఆదివారం | 02 ఆగస్టు, 2026 | పేజీలు : 08


## విద్యార్థులకు నాణ్యమైన విద్య : కలెక్టర్ సత్యప్రసాద్


వివరాలు మెయిన్‌లో...

# సీఎం సహాయ నిధి.. నిరుపేదలకు వరం

### మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** నిరుపేద కుటుంబాలకు సీఎం సహాయ నిధి ఒక వరం లాంటిదని, కుటుంబానికి ఎంతగానో ఆర్థికంగా తోడ్పడుతుందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.జగిత్యాల గొల్లపల్లి మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన 75 మంది లబ్ధిదారులకు రూ.25,63,500 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం ఆర్ ఎఫ్)చెక్కులను శనివారం సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ,పేదరికంతో బాధపడుతూ అనారోగ్యాల బారిన పడుతున్న వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించడం ద్వారా ప్రభుత్వం భరోసాగా నిలుస్తుంది అన్నారు. కార్పొరేట్ స్థాయి వైద్యం చేయించుకోలేని పేదలకు ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి కొండంత అండగా నిలుస్తుందని తెలిపారు . అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పారదర్శకంగా సంక్షేమ ఫలాలు అందజేస్తోందని పేర్కొన్నారు.ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా ఉంటుందని సంక్షేమ పథకాలను ప్రతి అర్హుడికి చేరవేయడమే ప్రభుత్వ లక్ష్యమని,గత ప్రభుత్వంలో సాధ్యం కాని నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని మన ప్రజా ప్రభుత్వంలో సాధ్యం చేసి నూతన రేషన్ కార్డులతో పాటు సన్న బియ్యాన్ని కూడా అందజేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ సంగన బట్ల దినేష్ ,ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్ ,తహసిల్దార్ అబ్దుల్ మజీద్ ,ఎంపీడీవో రవీందర్రావు ,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాపల్లి గంగన్న ,డిసిసి వైస్ ప్రెసిడెంట్ ముస్కు నిశాంత్ రెడ్డి ,ప్రజాప్రతినిధులు, అధికారులు,పార్టీ నాయకులు, లబ్ధిదారులు,పాల్గొన్నారు.



### విద్యుత్ లైన్ల మార్పిడి పనులకు మంత్రి అడ్లూరి శంకుస్థాపన

జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలో ఇళ్ల పైనుంచి వెళ్తున్న 11 కేవీ, 33 కేవీ విద్యుత్ లైన్ల మార్పిడి పనుల లకు తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులతో కలిసి శనివారం శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ మండల కేంద్రంలో విద్యుత్ సౌకర్యాల మెరుగుదల కోసం సుమారు రూ.74 లక్షలతో విద్యుత్ తీగల మార్పిడి పనులను చేపట్టినట్లు తెలిపారు. ధర్మపురి నియోజకవర్గంలో విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం సుమారు రూ.4 కోట్లను మంజూరు చేసిందని, అందులో గొల్లపల్లి మండలానికే దాదాపు రూ.2.3 కోట్ల నిధులు కేటాయించినట్లు వెల్లడించారు.ఈ పనులు పూర్తయిన అనంతరం మండలం లోని సుమారు 150 కుటుంబాలకు విద్యుత్ భద్రత మెరుగుపడి ఇళ్ల మీదుగా వెళ్తున్న విద్యుత్ లైన్ల వల్ల ఏర్పడుతున్న ప్రమాదాల నుండి శాశ్వత ఉపశమనం లభించనుందని అన్నారు. విద్యుత్ వ్యవస్థను మరింత బలోపేతం చేసి ప్రజలకు నాణ్యమైన అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ సంగ నభట్ల దినేష్ ,ఏఎంసీ చైర్మన్ బీమా సంతోష్ ,వైస్ చైర్మన్ పురపాటి రాజిరెడ్డి,సర్పంచ్ నల్ల నీరజ సతీష్ రెడ్డి ,ఉప సర్పంచ్ గురిజాల బుచ్చిరెడ్డి,సూపరింటెండింగ్ ఇంజనీర్ కె గంగారం ,అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ వరుణ్ కుమార్ ,ఏ ఈ రాకేష్ కుమార్,సబ్ ఇంజనీర్లు,ఓ అండ్ ఎం సిబ్బంది,తహసిల్దార్ అబ్దుల్ మాజీద్,ఎంపీడీవో రవీందర్రావు,డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి,ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,గ్రామ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

## రామ్‌నగర్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్

**ప్రజాపక్షం/కరీంనగర్:** ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామ్‌నగర్ ప్రాంతంలో విస్తృత కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (లా అండ్ ఆర్డర్) వెంకటరమణ, టౌన్ ఏసీపీ వెంకటస్వామి, టూ టౌన్ ఇన్స్పెక్టర్ సృజన్ రెడ్డి నేతృత్వంలో పోలీస్ సిబ్బంది పాల్గొని స్థానిక ప్రజలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో అధికారులు మాట్లాడుతూ సైబర్ మోసగాళ్ల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అపరిచిత లింక్‌లను క్లిక్ చేయవద్దని, ఓటీపీ లేదా బ్యాంక్ వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని హెచ్చరించారు. ఒకవేళ మోసపోయినట్లయితే వెంటనే 1930 జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. గంజాయి, మత్తు పదార్థాల వినియోగం మరియు అక్రమ రవాణా వల్ల యువత జీవితాలు ఎలా నాశనం అవుతున్నాయో వివరించారు. కాలనీల్లో ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. పెరిగిపోతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని విజ్ఞప్తి చేశారు. కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్‌లో భాగంగా రామ్‌నగర్ ప్రాంతంలో ద్విచక్ర వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. వాహనాల రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికేట్ తదితర పత్రాలను పరిశీలించారు. సరైన పత్రాలు లేని వాహనదారులపై మోటారు వాహనాల చట్టం ప్రకారం చలానాలు విధించి జరిమానాలు విధించారు. ప్రజలు అన్ని వాహన పత్రాలను ఎల్లప్పుడూ వెంట ఉంచుకొని ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. నేరాల నివారణలో నేను సైతం ప్రాజెక్ట్ కింద ప్రతి కాలనీ, వీధి మరియు వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా భద్రతను మరింత మెరుగుపరచుకోవచ్చని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ పెద్దలు, యువకులు, మహిళలు మరియు పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మహబూబ్ ఘాట్ జలపాతం వద్దకు వెళ్లొద్దు

### నిర్మల్ డిఎఫ్ఒ సుశాంత్ సుఖ్దేవ్ బోబడే హెచ్చరిక

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** భారీ వర్షాల కారణంగా ప్రమాదకరంగా మారిన మహబూబ్ ఘాట్ జలపాతం వద్దకు ప్రజలు, పర్యాటకులు ఎవరూ వెళ్లకూడదని నిర్మల్ జిల్లా అటవీ అధికారి (డిఎఫ్ఒ) సుశాంత్ సుఖ్దేవ్ బోబడే,ఐఎఫ్ఎస్ స్పష్టం చేశారు. సహ్యాద్రి పర్వత శ్రేణుల్లో రానాపూర్ బీట్ పరిధిలో ఉన్న ఈ జలపాతాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో జలపాతం ఉధృతి అత్యంత ప్రమాదకరంగా మారిందని తెలిపారు. వర్షాకాలంలో నీటి ప్రవాహం ఆకస్మికంగా పెరిగే అవకాశం ఉన్నందున జలపాతం వద్ద గుమిగూడడం, స్నానాలు చేయడం, సెల్ఫీలు దిగడం వంటి ప్రాణాపాయ చర్యలకు ఎవరూ పాల్పడవద్దని హెచ్చరించారు.ఈ జలపాతం అటవీ ప్రాంతంలో ఉన్నందున అనుమతి లేకుండా ప్రవేశించడం లేదా అటవీ నిబంధనలను ఉల్లంఘించడం చేస్తే భారత అటవీ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా అటవీ అధికారి స్పష్టం చేశారు.ప్రజలు తమ ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని, అటవీ శాఖ అధికారులకు సహకరించాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.



## 'సర్' గడువు ఈ నెల 10 వరకు పొడిగింపు

### కలెక్టర్ గరిమ అగ్రవాల్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనల ప్రకారం జిల్లాలో పోలింగ్ స్టేషన్ల హేతబద్దీకరణ ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. పోలింగ్ స్టేషన్ల హేతబద్దీకరణ, ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి కలెక్టర్ శనివారం సమీక్ష నిర్వహించారు. పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ, ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన షెడ్యూల్, ఓటర్ల నమోదు, ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ తదితర అంశాలపై కలెక్టర్ సమగ్రంగా వివరించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనల ప్రకారం 1200 మందికి పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ స్టేషన్లు లేవని తెలిపారు. ఎస్ఐఆర్ గడువును ఆగస్టు 10వ తేదీ వరకు ఎన్నికల సంఘం పొడిగించిందని, జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ వేగంగా జరుగుతుందని, ఇప్పటికే జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియ 87.42 శాతం పూర్తయిందని వివరించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆగస్టు 17న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ జరుగుతుందని, అదే రోజు నుంచి సెప్టెంబర్ 16వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు కలెక్టర్ వివరించారు. కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే వారు ఫారం–6 ద్వారా, అదే నియోజకవర్గం లేదా ఇతర నియోజకవర్గానికి ఓటును బదిలీ (షిఫ్టింగ్) చేసుకోవాలనుకునే వారు ఫారం–8 ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆగస్టు 17వ తేదీ ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ నుండి సెప్టెంబర్ 16వ తేదీ వరకు ఈ దరఖాస్తులను సమర్పించవచ్చని అన్నారు. ఈ సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓ లు శ్రీధర్ బాబు, కె.ఎస్.బి.కుమారి, పర్యవేక్షకులు ప్రవీణ్, ఎలక్షన్ విభాగం నాయబ్ తహసీల్దార్ రెహమాన్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, పాల్గొన్నారు.



## న్యాయవాద పరిషత్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్:** కరీంనగర్ న్యాయవాద పరిషత్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. శనివారం నగరంలోని న్యాయవాదుల బార్‌రూమ్‌లో నిర్వహించిన సమావేశంలో సంఘం సభ్యుల సమక్షంలో జరిగిన ఈ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షునిగా తిరునగిరి వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శిగా ముత్యాల తిరుపతి రెడ్డి, కోశాధికారిగా కోట మునీందర్‌లు ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా తిప్పర్తి శ్రీనివాస్, దాసరి శ్రీనివాస్ రెడ్డి, సర్దా నిషా సింగ్, జాయింట్ సెక్రటరీలుగా టి.ప్రవీణ్ కుమార్, నక్క ప్రణయ్, ప్యాట్రన్ సభ్యులుగా తొగరు గౌతంరెడ్డి, జూపల్లి సత్యనారాయణ రావు, ఎర్రం రాజారెడ్డిలు ఎన్నుకోబడ్డారు. త్వరలోనే జిల్లా కార్యవర్గ సభ్యులను నియమించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పరిశీలకులుగా న్యాయవాద పరిషత్ కేంద్ర నాయకులు మోహన్ కరోర్, రాష్ట్ర కార్యదర్శి సునీల్, రాష్ట్ర కమిటీ సభ్యులు సంజీవ్ రెడ్డిలు హాజరై నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి

**ప్రజాపక్షం / మానకొండూర్:** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని వేగురుపల్లి గ్రామ సర్పంచ్ పడాల సత్యనారాయణ గౌడ్ ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని వేగురుపల్లి గ్రామంలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ సత్యనారాయణ గౌడ్ పంచాయతీ కార్యదర్శి తుల్జారాణీ ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో పచ్చదనం పెంచడం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని సూచించారు. వాతావరణం సమతుల్యంగా ఉండాలంటే సరైన సమయంలో వర్షాలు కురవాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని అన్నారు. అంతకుముందు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముద్దసాని శ్రీధర్ రెడ్డి, ఉప సర్పంచ్ కట్కూరి వెంకట్ రెడ్డి, వార్డు సభ్యులు చర్లపల్లి నర్సయ్య గౌడ్, రాపాక అశోక్, కనుకుంట్ల అంజయ్య, బండారి రంగయ్య, ల్యాగల ఓదమ్మ, కోల కళ్యాణి, కారోబార్ ముద్దసాని రంగారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ యాదగిరి, ఆశా వర్కర్లు, వివోలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం వైపే వరుణ దేవుడు

### సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ :** వరుణ దేవుడు కాంగ్రెస్ ప్రభుత్వం వైపే ఉన్నాడని అందులో ఏలాంటి సందేహం లేదని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. స్థానిక ముకరాంపురలోని మాజీ సుడా చైర్మన్ క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో నిర్మించిన శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్, మిడ్‌మానేరు ప్రాజెక్టు వల్లనే నీళ్లు వస్తున్నాయన్న విషయం మరొకసారి రుజువైందని అన్నారు. వర్షాభావ పరిస్థితులను ఆసరా చేసుకొని మేడిగడ్డ నుంచి నీళ్లు పంపు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేయడానికి కేటీ ఆర్, హరీష్ రావులు అనేక ప్రయత్నాలు చేశారని కమీషన్ల కక్కుర్తి తోటి మేడిగడ్డ బ్యారేజీ మచ్చను ప్రజల దృష్టి మళ్లించడానికి కుట్ర చేశారని విమర్శించారు. ప్రపంచమంతా ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పటికీ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాపాలనను చూసి వరుణ దేవుడు మంచి వర్షాలు కురిపిస్తున్నాడని అన్ని ప్రాజెక్టులు నిండుతున్నాయని తెలిపారు. ఆనాడు ఇందిరా చౌక్ సుందరీకరణకు కోటి ఎనభై లక్షలు వెచ్చిస్తే మేము అధికారంలోకి వచ్చిన తర్వాత యూనివర్సిటీ ముందున్న జ్యోతిబా పూలే చౌక్ సుందరీకరణ పద్దెనిమిది లక్షలతో చేశామని గుర్తు చేశారు. భగత్‌నగర్‌లో స్వంత అల్లుడు మనవడు దొంగతనానికి పాల్పడితే కూడా రాజకీయం చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. పోలీసులు 3 రోజుల్లో నిందితులను పట్టుకున్నారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో సజావుగా ప్రజాపాలన కొనసాగుతుందని ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల సంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో గుండాటి శ్రీనివాస్ రెడ్డి, కుర్ర పోచయ్య, గుడిపాటి రమణారెడ్డి, తోట అంజయ్య, బషీర్, భారీ, మాసుం ఖాన్, ఇమ్రాన్, ఖలీల్ పాల్గొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన ఉద్యోగికి ఏఐటియుసి నాయకుల సన్మానం

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణి ఆర్జీ వన్ ఏరియా కు నూతనంగా పర్సనల్ ఆఫీసర్ గా బాధ్యతలు స్వీకరించిన రెడ్డిమల్ల తిరుపతి ని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఆధ్వర్యంలో శనివారం ఆర్జీ వన్ జనరల్ మేనేజర్ కార్యాలయం లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ ఆఫీసర్ తిరుపతి కి ఏఐటియుసి నాయకులు, కార్యకర్తలు పూల బొకే అందించి శాలువా కప్పి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను లు మాట్లాడుతూ ఆర్జీ వన్ ఏరియా లో ఉన్న కార్మికుల సమస్యలను పెండింగ్ లో పెట్టకుండా పరిష్కారానికి కృషి చేయాలని, కార్మికుల మన్ననలు పొందాలని వారు పేర్కొన్నారు.ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐటియుసి



ఆర్జీ వన్ బ్రాంచి ఆఫీస్ బేరర్స్ మాదన మహేష్, సంకె అశోక్,బోగ సతీష్ బాబు,దొంత సాయన్న, గండి ప్రసాద్,చెప్యాల భాస్కర్,సయ్యద్ సోహెల్, సిర్ర మల్లికార్జున్, పి.విజయలక్ష్మి ,నాయకులు పొన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్న,గుర్రం ప్రభుదాస్,బలుసు రవి,బండి మల్లేష్, ఇజ్జగిరి రాజు,గోడిశల నరేశ్,ఉప్పులేటి తిరుపతి, బి.సమ్మయ్య,బండారి శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

## 'ఆక్వా హబ్'లో స్థానిక నిరుద్యోగులకే ఉద్యోగ అవకాశాలు



సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి గుంటి వేణు

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** చీర్లవంచలో నెలకొల్పిన ఆక్వా హబ్ లో స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరుతూ శనివారం జిల్లా కలెక్టర్ కు సిపిఐ మాజీ కార్యదర్శి గుంటి వేణు వినతి పత్రం అందజేశారు. స్థానిక నిరుద్యోగులకే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఆ నాటి ప్రభుత్వం చెప్పిందని, ఆక్వా హ బ్ యాజమాన్యం ఇతర ప్రాంతాల నుండి కార్మికులను తీసుకువచ్చి పని చేయిస్తున్నారని పేర్కొన్నారు. ముంపు గ్రామాలైన 12 గ్రామాల్లో ఎలాంటి కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసిన స్థానికులకే అవకాశాలు కల్పించాలని ఇచ్చిన వినతి పత్రంలో కోరారు. ఆక్వాహబ్ లో పనిచేస్తున్న కార్మికులందరికీ 26వేల వేతనం చెల్లించి ఈఎస్ఐ పిఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. చీర్లవంచ గ్రామంలోని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు.

**ఉపాధి హామీ సిబ్బందికి పెండింగ్ లో ఉన్న బకాయిలు వెంటనే విడుదల చేయాలి**

ఉపాధి హామీ సిబ్బందికి మూడు నెలల నుండి జీతాలు చెల్లించడం లేదని వెంటనే చెల్లించాలని డిఆర్ డిఓ కు గుంటి వేణు వినతి పత్రం అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నివారించి కూలీలకు ఉపాధి కల్పించే సిబ్బందికి నెలల తరబడి జీతాలు అందక కుటుంబ పోషణ భారమైందని పేర్కొన్నారు. చాలీచాలని వేతనాలతో కాలం గడుపుతున్న వీరికి వెంటనే బకాయిలు చెల్లించి ఆదుకోవాలని కోరారు. ఈయన వెంట సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సోమ నాగరాజు ఉన్నాడు.

## జూలై నెల బొగ్గు ఉత్పత్తి, రవాణా వివరాలను వెల్లడించిన జి.ఎంలు

**ప్రజాపక్షం/రామగిరి :** జూలై నెల బొగ్గు ఉత్పత్తి, రవాణా వివరాలనురామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ కొలిపాక నాగేశ్వరరావు శనివారం జీ.యం కార్యక్రమంలో జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో బొగ్గు ఉత్పత్తి వివరాలను వెల్లడించారు.రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ మాట్లాడుతూ జూలై నెలలో రామగుండం3 ఏరియాకు నిర్దేశించిన 2.30 లక్షల టన్నుల లక్ష్యానికి గాను, 1.95 లక్షల టన్నులు అనగా 85 శాతం బొగ్గు ఉత్పత్తి, తో పాటు, కంపనీ షావల్స్, ఓవర్ లోడింగ్ కు నిర్దేశించిన 21.00 లక్షల క్యూబిక్ మీటర్ల ఓ.బి(మట్టి)వెలికితీత లక్ష్యానికి గాను, 21.06 లక్షల క్యూబిక్ మీటర్లు అనగా 100 శాతం ఓ.బి (మట్టి) వెలికి తీయడం జరిగిందని, అదేవిధంగా 4.68 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేయడం జరిగిందన్నారు. తదుపరి గనులవారిగా ఉత్పత్తి వివరాలను



తెలియజేస్తూ జూలై నెలలో ఓ.సి.పి1 గనికి నిర్దేశించిన 0.30 లక్షల టన్నుల లక్ష్యానికి గాను, 1.18 లక్షల టన్నులు అనగా 394 శాతం, ఓ.సి.పి2 గనికి నిర్దేశించిన 2.00 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 0.76 లక్షల టన్నులు అనగా 38 శాతం బొగ్గు ఉత్పత్తి చేయడం జరిగిందన్నారు. భవిష్యత్తులో కూడా లక్ష్యానికి అనుగుణంగా బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయడానికి తగిన చర్యలు తీసుకుంటూ విధులు నిర్వహించాలని కోరారు.జూలై మాసంలో అధిక వర్షాలు కురిసినందున ఉత్పత్తిలో కొంత వెనుకపడ్డామని, వర్షాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్త చర్యలను తూచ తప్పక పాటించాలని, ఉద్యోగులందరూ బాధ్యతాయుతంగా పనిచేస్తూ సింగరేణి సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను భద్రత తో సాధించడానికి కృషి చేయాలన్నారు.అనంతరం అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు మాట్లాడుతూ అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్ట్ కు జూలై నెలలో నిర్దేశించిన 15,300 టన్నుల లక్ష్యానికి గాను 15,777 టన్నులు బొగ్గు ఉత్పత్తి చేయడం జరిగిందన్నారు. 4వ ప్యానెల్ తయారీ పనులు కొనసాగుతున్నాయని, త్వరలోనే పనులు పూర్తి చేసి నిర్దేశించిన లక్ష్యాలను భద్రతతో సాధించడానికి ఉద్యోగులందరూ కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్వోటుజియం యం.రామ్మోహన్, ఏరియా ఇంజినీర్ ఎ.ఉదయ భాస్కర్, ఐ ఇ డీజీఎం బి.టి.మురళీ కృష్ణ, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, డివై పియం యం.డి.ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ ఎన్నికలు ఏకగ్రీవం

**ప్రజాపక్షం/కరీంనగర్:** జిల్లాల పునర్విభజన అనంతరం తెలంగాణ రాష్ట్రంలో జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార సంఘాల యూనియన్ ఎన్నికలు పూర్తయిన తొలి జిల్లాగా కరీంనగర్ నిలిచిందని, జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్‌కు అధ్యక్ష, ఉపాధ్యక్ష, డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని ఎన్నికల అధికారి తెలిపారు. ఎన్నికల అధికారి జలాలొద్దీన్ అక్బర్ మాట్లాడుతూ, జిల్లా యూనియన్ అధ్యక్షుడిగా భాషవేణి మల్లేశం యాదవ్, ఉపాధ్యక్షుడిగా చిగుర్ల శ్రీనివాస్ కురుమ ఏకగ్రీవంగా ఎన్నికైనారని, డైరెక్టర్లుగా అగిత రవీందర్, కాల్వ సురేష్, చౌటపల్లి రంజిత్, జిల్లెల్ల పరశురాములు, దాడి ఆంజనేయులు, దాడి సదయ్య, దానే ఒదేలు, బండి మల్లయ్య, ముక్కెర సదానందం, సందవేణి ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు. నూతనంగా ఎన్నికైన జిల్లా యూనియన్ అధ్యక్షుడు భాషవేణి మల్లేశం యాదవ్ మాట్లాడుతూ, తన ఎన్నికకు సహకరించిన జిల్లా ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘాల (గ్రామ అధ్యక్షులకు, యాదవ, కురుమ సోదరులకు, కుల పెద్దలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ వంశీకృష్ణ, సీనియర్ ఇన్‌స్పెక్టర్ సర్దార్ ప్రీత్‌పాల్ సింగ్ సహకార సంఘాల సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్:** కరీంనగర్ జిల్లాలోని పలు ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న 60 అంగన్వాడీ టీచర్ పోస్టుల భర్తీకి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గంగాధర ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో 20, హుజురాబాద్‌లో 16, కరీంనగర్ రూరల్ పరిధిలో 16, కరీంనగర్ అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలో 8 అంగన్‌వాడీ టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. ఈనెల 15వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు ధరఖాస్తులు ఆన్‌లైన్‌లో మాత్రమే స్వీకరించనున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ అర్హత ఉన్న మహిళలు మాత్రమే పోస్టులకు అర్హులని అభ్యర్థి సంబంధిత అంగన్వాడి కేంద్రం పరిధిలోని గ్రామ పంచాయతీ, పట్టణాలు, నగరంలో అయితే వార్డు డివిజన్‌లో స్థానికురాలు అయి ఉండాలని తెలిపారు. 1 జూలై 2026 నాటికి 18 నుంచి 35 సంవత్సరాల లోపు మహిళలు అర్హులని తెలిపారు. ఖాళీల వివరాలు, ఎంపిక ప్రక్రియ, రిజర్వేషన్ తదితర వివరాల కోసం హెచ్‌టిటిపిఎస్.//డబ్ల్యుడిసిడబ్ల్యు.టిజి.ఎన్ఐసి.ఇఎన్ వెబ్ సైట్‌ను సందర్శించాలని ఈ వెబ్‌సైట్ ద్వారానే ధరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.

## ఎమ్మెల్యేను కలిసిన ఆలయ నూతన కమిటీ

**ప్రజాపక్షం /రాయికల్ :** రాయికల్ మండల భూపతిపూర్ గ్రామ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం నూతన చైర్మన్ గా జక్కుల చంద్ర శేఖర్ నియామకం అయ్యారు. నూతన కమిటీ సభ్యులు శనివారం జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ సందర్భంగా నూతన ఆలయ సభ్యులకు ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేందర్ మాజీ పాక్స్ చైర్మన్ శేఖర్ రెడ్డి,ఉప సర్పంచ్ సంజీవ్ చారి,కమిటి సభ్యులు దిలీప్,జక్కుల సాగర్,మహేందర్, నాగరాజు,అర్చకులు వెంకట కృష్ణ,ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

## వావిలాల తిరుపతికి పదోన్నతి



**ప్రజాపక్షం/ధర్మపురి :** ప్రముఖ పుణ్యక్షేత్రం ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానంలో జూనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న వావిలాల తిరుపతి కి సీనియర్ అసిస్టెంట్ గా పదోన్నతి లభించింది.ధర్మపురి దేవస్థానంలో ఇటీవల ఖాళీగా ఏర్పడిన సీనియర్ అసిస్టెంట్ పోస్టును తిరుపతి కి కేటాయిస్తూ దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు యల్ డిస్ నంబర్ బి1/11701/2026 ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి కల్పిస్తూ జారీచేసిన ఉత్తర్వుల కాపీని శనివారం సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తిరుపతి కి అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనబట్ల దినేష్,మున్సిపల్ వైస్ చైర్పర్సన్ వేముల నాగలక్ష్మి,దేవస్థానం కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్, సూపరిండెంట్ అలువాల శ్రీనివాస్,తదితరులు ఉన్నారు.

## ఫీల్డ్ అసిస్టెంట్లుం విధుల్లోనే కొనసాగుతున్నాం

**ప్రజా పక్షం /ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో వి బిజి రామ్‌జీలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లుం విధుల్లోనే కొనసాగుతున్నామని, ఎపివోలు, ఇసిలు,టిఏలు,సివోలు నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాలతో తమకు ఎలాంటి సంబంధం లేదని జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల ఫీల్డ్ అసిస్టెంట్ల అధ్యక్షుడు కర్నాసుమన్ అన్నారు.అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో మండల ఎంపీఓ రామకృష్ణ రాజుని శనివారం కలిసి ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ అధ్యక్షుడు కర్నా సుమన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లు బన్న పోచయ్య,సుంకే ప్రభాకర్,నల్ల రాజన్న,ఆర్మూర్ రాజేందర్,తిమ్మిని అంజయ్య,వంశీ, నరేందర్, బాషా,రాజేష్,తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ డెయిరీ చైర్మన్‌కు సన్మానం

**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ :** అమెరికాలోని మేరీ ల్యాండ్ యూనివర్సిటీ నుంచి హానరరీ డాక్టరేట్ ఫిలాసఫీ ఇన్ వైట్ రివోల్యూషన్ గౌరవ డాక్టరేట్ అందుకున్న కరీంనగర్ డెయిరీ చైర్మన్ చల్మెడ రాజేశ్వర్ రావుని బిఆర్ఎస్ నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు జి.వి.రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, బిఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పొన్నం అనిల్‌లు శాలువాతో ఆయనకు సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రవి, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

## జమ్మికుంటలో 'శ్రీరామ హృదయం' ర్యాలీ

**ప్రజాపక్షం / జమ్మికుంట :** జమ్మికుంట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీ శ్రీ శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి మంగళ శాసనములతో శ్రీరామ హృదయం ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా కలశం ఏర్పాటు చేయడం జరిగింది. దేవాలయం ప్రాంగణంలో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. వికాస తరంగిణి సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ప్రభుత్వ ఆస్పత్రులకు ఎన్‌టిపిసి అంబులెన్సులు

**ప్రజాపక్షం/గోదావరిఖని :** కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్సాఆర్) కార్యక్రమంలో భాగంగా ఎన్‌టిపిసి రామగుండం సంస్థ గోదావరిఖని, పెద్దపల్లిలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రులకు రూ.43.50 లక్షల విలువ గల రెండు అంబులెన్స్‌లను విరాళంగా అందించింది. శనివారం ఎన్‌టిపిసిలో సంస్థ రామగుండం ఈ.డి.(ఆర్అండ్‌టి) చందన్ కుమార్ సమంత జెండా ఊపి అంబులెన్స్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇడిమాట్లాడుతూ, రోగులను సకాలంలో తరలించేందుకు, అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ఈ అంబులెన్సులు ఎంతగానో ఉపయోగపడ్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్లు, విభాగాధిపతులు, యూనియన్, అసోసియేషన్ ప్రతినిధులు, హెచ్ఆర్ బృంద సభ్యులు హాజరయ్యారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి: కలెక్టర్



**ప్రజాపక్షం /రాయికల్ :** జిల్లాలోని ప్రజలకు ప్రభుత్వ వైద్యులు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పేర్కొన్నారు.శనివారం రాయికల్ పట్టణ కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి ఓ.పి. సేవలు, ఐపీ సేవలు రికార్డ్స్ ల్యాబ్ రికార్డ్స్ ఐపీ రికార్డ్స్ మెడికల్ ఫార్మసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో వైద్య సేవలను గురించి నేరుగా పేషంట్లని వివరాలు అడిగి తెలుసుకున్నారు.వైద్య సేవలు మెరుగు పరచాలని డాక్టర్లు సమయపాలన పాటించాలని, ఆసుపత్రి లో అటెండెన్స్ బయోమెట్రిక్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రోజుకు ఎన్ని ఓ.పి.లను చూస్తున్నారని అడిగి తెలుసుకున్నారు.సామాజిక ఆరోగ్య కేంద్రంలో వర్షాకాలం వ్యాధుల పట్ల డెంగ్యూ, వైరల్ ఫీవర్లకు మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. కాలం చెల్లిన మందులు ఉండకుండా చూసుకోవాలన్నారు. డాక్టర్లను పేషంట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణలోని వున్న మంచినీటి సౌకర్యాలను ఎప్పటికప్పుడు నాణ్యతమైన వంట సామాగ్రి మంచి భోజనం అందించాలి ఆదేశించారు.ఈ పరిశీలనలో జిల్లా ఆస్పత్రి కోఆర్డినేషన్ అధికారి డాక్టర్ రామకృష్ణ , ఎమ్మార్వో, ఎంపిడివో,ఆస్పత్రి సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

## సహకార సంఘాల అభివృద్ధికి నూతన అధికారుల సహకారం

### జగిత్యాల పిఎసిఎస్ చైర్మన్ పత్తిరెడ్డి మహిపాల్ రెడ్డి



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల ది కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు జగిత్యాల బ్రాంచికి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన బ్రాంచ్ మేనేజర్ మార్కండేయ, డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ వేణుగోపాల్ రావులను జగిత్యాల పీఏసీఎస్ చైర్మన్ పత్తిరెడ్డి మహిపాల్ రెడ్డి హృదయపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా పత్తిరెడ్డి మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ జగిత్యాల కేడిసిసి బ్యాంకు బ్రాంచ్ పరిధిలో జగిత్యాల,కల్లెడ,సారంగాపూర్ సహకార సంఘాలు ఉన్నాయని, ఆయా సహకార సంఘాల అభివృద్ధికి నూతన బ్రాంచ్ మేనేజర్,డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు. అదేవిధంగా బ్యాంకు ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలు అందించడంతో పాటు, రైతులు, సహకార సంఘాల సభ్యుల అవసరాలకు అనుగుణంగా సమర్థవంతంగా పనిచేయాలని వారు కోరారు.సహకార రంగం అభివృద్ధిలో బ్యాంకు అధికారులు,సంఘాల ప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలని జగిత్యాల పీఏసీఎస్ చైర్మన్ పత్తిరెడ్డి మహిపాల్ రెడ్డి ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సంఘాల కార్యదర్శులు గాజెంగి వేణు,జజాలా శేఖర్, లైశెట్టి శివకుమార్,సిబ్బంది రాజేష్, నవీన్, అజయ్, నారాయణ,గంగాధర్,తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రనాట్యంలో ట్రినిటీ స్కూల్ విద్యార్థిని అసాధారణ ప్రతిభ




**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ సాలేహ్ నగర్ లోని ట్రినిటీ – ది స్కూల్ ఆఫ్ లెర్నింగ్ పాఠశాల విద్యార్థిని పులి దేవాన్షి తన అసాధారణ ఆంధ్రనాట్యం ప్రతిభతో పాఠశాలకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకువచ్చిందని పాఠశాల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి తెలిపారు. పులి దేవాన్షి విజయవాడలోని మారిస్ స్టెల్లా ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన మ్యాక్సిమమ్ డ్యాన్సర్స్ పెర్ఫార్మింగ్ ఆంధ్రనాట్యం సిమల్టేనియస్‌లీ అనే ప్రతిష్ఠాత్మక రికార్డు కార్యక్రమంలో పాల్గొంది. ఈ కార్యక్రమంలో 500 మంది శిక్షణ పొందిన నృత్య కళాకారులు ఒకేసారి సమన్వయంతో ఒకే సమయంలో ఆంధ్రనాట్యాన్ని ప్రదర్శించారు. ఈ విశిష్ట రికార్డు కార్యక్రమంలో పాల్గొన్నందుకు ఆమెకు ప్రశంసా పత్రం అందజేశారు. మే 2026లో తిరుపతిలోని మహతి ఏ/సీ ఆడిటోరియంలో ప్రైడ్ ఇండియా కల్చరల్ అండ్ సిటిజెన్స్ వెల్ఫేర్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన కల్చరల్ హెరిటేజ్ ఆఫ్ తిరుపతి డ్యాన్స్ ఫెస్ట్‌లో కూడా దేవాన్షి పాల్గొని అద్భుత ప్రతిభను కనబరిచింది. ఈ సందర్భంగా ఆమె పేరు మెరిట్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో నమోదు చేయబడటమే కాకుండా, ప్రశంసా పత్రంతోపాటు బంగారు పతకం, జ్ఞాపిక తో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి, అకాడెమిక్ డైరెక్టర్ డా. దాసరి మమతా రెడ్డి , మరియు ప్రిన్సిపల్ రత్నమాల విద్యార్థిని పులి దేవాన్షిని అభినందించి, ఆమె అంకితభావం, క్రమశిక్షణ, పట్టుదల మరియు శాస్త్రీయ నృత్యంలో కనబరిచిన ప్రతిభను ప్రశంసించారు. భవిష్యత్తులో మరెన్నో విజయాలను సాధించాలని ఆకాంక్షిస్తూ తమ శుభాకాంక్షలు తెలిపారు. దేవాన్షి ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించిన ఆమె తల్లిదండ్రులు మరియు నృత్య గురువుకు పాఠశాల యాజమాన్యం హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

## ప్రభుత్వ సిఎంఆర్ ధాన్యం దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు

### మూడు రైస్ మిల్లులపై రూ.87.89 కోట్లకు పైగా విలువైన అక్రమాల కేసులు నమోదు



**ప్రజాపక్షం/జగిత్యాలరూరల్ :** ప్రభుత్వ కస్టమ్స్ మిల్లింగ్ (సీఎంఆర్) కోసం రైస్ మిల్లులకు అప్పగించిన ధాన్యాన్ని నిబంధనలకు విరుద్ధంగా దుర్వినియోగం చేసి ప్రభుత్వానికి రూ.87.89 కోట్లకు పైగా నష్టం కలిగించారనే ఆరోపణలపై జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు జగిత్యాల రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తెలిపారు. జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తక్కల్లపల్లి శివారులో ఉన్న మూడు రైస్ మిల్లులకు సంబంధించిన యాజమాన్యాలపై ఈ కేసులు నమోదయ్యానట్లు తెలంగాణ రాష్ట్ర గిడ్డంగులు, పౌర సరఫరాల సంస్థ లిమిటెడ్ (టీజీఎస్‌సీఎస్‌సీ), జగిత్యాల జిల్లా మేనేజర్ అగ్రగోవుల జితేంద్ర ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేసినట్లు వారు వెల్లడించారు. ప్రభుత్వం కస్టమ్స్ మిల్లింగ్ కోసం అప్పగించిన ధాన్యాన్ని సంబంధిత రైస్ మిల్లుల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు, జిల్లా కలెక్టర్ ఆదేశాలు,రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలను ఉల్లంఘించి అక్రమంగా దుర్వినియోగం చేసినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించినట్లు జగిత్యాల రూరల్ పోలీసులు తెలిపారు. అభయాంజనేయ సాయి ఇండస్ట్రీస్‌లో రూ.43.72 కోట్ల విలువైన ధాన్యం కొరత, ఎం/ఎస్ శ్రీ అభయాంజనేయ సాయి ఇండస్ట్రీస్ యాజమాన్య భాగస్వాములు కొండ లక్ష్మణ్, కొండ ప్రణీత్‌లు రబీ 2022–23, రబీ 2024–25, ఖరీఫ్ 2025–26, రబీ 2025–26 సీజన్లకు సంబంధించిన ప్రభుత్వ ధాన్యంలో 17,355.490 మెట్రిక్ టన్నుల కొరతకు బాధ్యులుగా గుర్తించినట్లు వారు తెలిపారు. ఈ ధాన్యం విలువ రూ.43,72,83,834గా నిర్ధారించినట్లు పేర్కొన్నారు. లక్ష్మీ బాలాజీ ఇండస్ట్రీస్‌లో రూ.38.68 కోట్ల విలువైన ధాన్యం కొరత ఎం/ఎస్ శ్రీ లక్ష్మీ బాలాజీ ఇండస్ట్రీస్ యాజమాన్య భాగస్వాములు కొండ ఉపేంద్ర, కొండ అరుణ రబీ 2022–23, రబీ 2024–25, రబీ 2025–26 సీజన్లకు సంబంధించిన ప్రభుత్వ ధాన్యంలో 15,046.575 మెట్రిక్ టన్నుల కొరతకు బాధ్యులుగా గుర్తించినట్లు తెలిపారు.ఈ ధాన్యం అంచనా విలువ రూ.38,68,24,297గా నిర్ధారించినట్లు వెల్లడించారు.లక్ష్మీ గణపతి ఇండస్ట్రీస్‌లో రూ.5.48 కోట్ల విలువైన ధాన్యం కొరత ఎం/ఎస్ శ్రీ లక్ష్మీ గణపతి ఇండస్ట్రీస్ యాజమాన్య భాగస్వాములు కొండ అరుణ,కొండ ఉపేంద్ర రబీ 2024–25 సీజన్‌కు సంబంధించిన ప్రభుత్వ ధాన్యంలో 1,984.720 మెట్రిక్ టన్నుల కొరత ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ ధాన్యం విలువ రూ.5,48,66,989గా నిర్ధారించినట్లు పేర్కొన్నారు. మొత్తం 34 వేల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం కొరత మూడు రైస్ మిల్లుల్లో కలిపి మొత్తం 34,386.785 మెట్రిక్ టన్నుల ప్రభుత్వ ధాన్యం కొరత ఉన్నట్లు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ధాన్యం మొత్తం అంచనా విలువ రూ.87,89,75,120గా నిర్ధారించినట్లు వెల్లడించారు.ఈ ఘటనలకు సంబంధించి ఆయా రైస్ మిల్లుల యాజమాన్య భాగస్వాములపై చట్టంలోని వర్తించే నిబంధనల ప్రకారం జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.ప్రభుత్వ ధాన్యం, ప్రజాధనం లేదా ప్రభుత్వ ఆస్తులను దుర్వినియోగం చేసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరినీ ఉపేక్షించబోమని జగిత్యాల రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ స్పష్టం చేశారు.

## 18 సంవత్సరాలలోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే వారిపై 27 కేసులు నమోదు

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** 18 సంవత్సరాలలోపు పిల్లలను పనిలో పెట్టుకుని వారితో పని చేయిస్తున్న వారిపై 27 కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి కేంద్ర ప్రభుత్వం సంవత్సరంలో రెండు సార్లు ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ అనే కార్యక్రమాలను నిర్వహించి తప్పిపోయిన బాలలను గుర్తించి వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చేలా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం కోసం ఈసంవత్సరం జులై 1 నుండి 31 వరకు పోలీస్ శాఖ,చైల్డ్ వెల్ఫేర్ కమిటీ,లేబర్ డిపార్ట్మెంట్, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్మెంట్,రెవెన్యూ, హెల్త్ డిపార్ట్మెంట్ , వివిధ శాఖల అధికారులతో జిల్లాలో టీమ్ లుగా ఏర్పాటు చేసి ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలను గుర్తించి విస్తృతంగా తనిఖీలు నిర్వహించి జిల్లా వ్యాప్తంగా 104 మంది బాలబాలికలను గుర్తించి వారి యొక్క తల్లిదండ్రుల వద్దకు చేర్చడం జరిగిందని పేర్కొన్నారు. బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం బాధ్యతాయుతంగా కృషి చేయాలని కోరారు. తరుచు బాలల చేత పనులు చేయిస్తున్న వారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. వీధి బాలలను చూసినప్పుడు స్థానిక పోలీస్ వారికి సమాచారం అందించాలని సూచించారు.

**జిల్లా పరిధిలో పోలీస్ యాక్ట్ అమలు..**

శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని జిల్లా పరిధిలో పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం నెల రోజుల (ఆగస్ట్ 1వ తేది నుండి 31 వరకు) పాటు జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ తెలిపారు. దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు,రాస్తారోకోలు,నిరసనలు,ర్యాలిలు,పబ్లిక్ మీటింగ్‌లు,సభలు,సమావేశాలు నిర్వహించరాదని,నిబంధనలకు విరుద్దిదంగా డి.జే వినియోగించారాదని తెలిపారు. శాతిభద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని సూచించారు.కాబట్టి జిల్లా ప్రజలు పోలీసు వారికి ఇట్టి విషయంలో సహకరించాలని శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని సూచించారు.

# పారమితలో ఘనంగా బోనాల ఉత్సవాలు



**ప్రజాపక్షం / కొత్తపల్లి :** కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మంకమ్మతోట పారమిత ఉన్నత పాఠశాలలో ఆషాఢ మాస బోనాల పండుగ సంబరాలను పారమిత పాఠశాల డైరెక్టర్ ప్రసూన ప్రసాదరావు జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు స్వయంగా బోనాలు ఎత్తుకొని పులివేషాలు, పోతరాజుల వేషాలు ధరించి డప్పు చప్పుల్ల కోలాహలంతో సందడి చేస్తూ అమ్మవారికి బోనాలు సమర్పించారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం మంత్ర ముగ్ధులను చేశారు. విద్యార్థులు చెప్పిన అమ్మవారి భవిష్యవాణి ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పారమిత విద్యా సంస్థల డైరెక్టర్ ప్రసూన ప్రసాదరావు మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు తల్లిదండ్రులు స్వయంగా బోనాలు ఎత్తుకొని అమ్మవారికి బోనాలు సమర్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అమ్మవారి భవిష్యవాణి విద్యార్థులు స్వయంగా వివరించే విధానం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థినీ విద్యార్థులు మన సంస్కృతిని నేర్చుకొని ముందుకు తీసుకెళ్లే విధానం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఆషాఢ మాసంలో పార్వతి అమ్మవారు గ్రామాలలో పోచమ్మ, గంగాలమ్మ, ముత్యాలమ్మ, ఎల్లమ్మ మొదలగు నామాలతో 101 అవతారాల రూపంలో ప్రజలను వరదల నుంచి, అంటు వ్యాధుల నుంచి, కరువు కాటకాల నుంచి ప్రజలను కాపాడుతుందని అన్నారు. ప్రజలు స్త్రీ దేవతలకు బోనాల రూపంలో పూజలు చేసి అమ్మవారి ఆశీస్సులు పొందుతున్నారని స్త్రీ యొక్క గొప్పతనాన్ని ఓర్పును, సహనంను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలరించాయి. ఈ కార్యక్రమంలో పారమిత విద్యా సంస్థల డైరెక్టర్లు ప్రసూన, అనుకర్ రావు, వినోద్ రావు, ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్, బాలాజీ, కవిత ప్రసాద్, సమన్వయకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అంకిత భావంతోసేవలందించడం అభినందనీయం



**ప్రజాపక్షం /మల్లాపూర్ :** మల్లాపూర్ మండలంలోని చిట్టాపూర్ గ్రామానికి చెందిన గణపతి విష్ణువర్ధన్ రాజు విద్యుత్ శాఖలో వివిధ సబ్ స్టేషన్ లలో ఆపరేటర్ గా అంకిత భావంతో పని చేస్తూ రైతుల నుండి ప్రశంసలందుకోవడం అభినందనీయమని 327 కార్మిక సంఘం యూనియన్ నాయకులు హరిప్రసాద్ అన్నారు.గత 25 సంవత్సరాలుగా సబ్ స్టేషన్ ఆపరేటర్ గా పని చేస్తూ అంకితభావంతో ఎదురు నిర్వహిస్తూ రైతులకు వినియోగదారులకు సేవలు అందించడంలో విష్ణువర్ధన్ రాజు సఫలమయ్యారని కొనియాడారు. అనంతరం విష్ణువర్ధన్ రాజును యూనియన్ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి వేణుగోపాల్,సభ్యులు నరహరి జలపతి,శివ,లక్ష్మ ణ్ ,వెంకటేష్,దిలీప్,శ్రీనివాస్ ,దేవేందర్,రాజు,విష్ణు,తదితరులు ఉన్నారు.

# ఫిర్యాదు చేసే ఎఇ పట్టించుకోవడం లేదు

**ప్రజాపక్షం/మల్లాపూర్:** మల్లాపూర్ మండల కేంద్రంలోని రిలయన్స్ టవర్ సమీపాన ఉన్న,విద్యుత్ స్తంభం ట్రాన్స్ఫార్మర్ గత నాలుగు నెలల క్రితం ఎవరికి సమాచారం లేకుండానే తొలగించారని, ఈ విషయమై విద్యుత్ శాఖ ఏఈకి ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడంలేదని మాజీ ఎంపీటీసీ మొరపు గంగారాజం అన్నారు.ఈ మేరకు శనివారం జిల్లా విద్యుత్ శాఖ అధికారికి లికిత పూర్వకంగా ఆయన ఫిర్యాదు చేశారు.తొలగించిన ట్రాన్స్ఫార్మర్ స్థానంలో మరల ఏర్పాటు చేయకుండా వదిలేశారని, అనుమతి లేకుండానే తొలగించిన వ్యక్తులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని తిరిగి మరల అదే స్థానంలో ఏర్పాటు చేయాలని ఇచ్చిన వినతి పత్రంలో కోరారు.

# ఆషాఢమాస గోరింటాకు వేడుకలు



**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** ప్రముఖ సినీనటి, బిగ్ బాస్, మై విలేజ్ షో ఫేమ్ గంగవ్వ వాల్మీకి ఆవాసంలో సందడి చేశారు.సేవాభారతి వాల్మీకి ఆవాసం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ కేంద్రంలో శనివారం నిర్వహించిన గోరింటాకు వేడుకల్లో మై విలేజ్ షో టీం సభ్యులు గంగవ్వ, చందు పాల్గొని మహిళలతో కలిసి సందడి చేశారు. ఆషాఢ మాసంలో మహిళలు అత్యంత వైభవంగా జరుపుకునే గోరింటాకు వేడుకల్లో భాగంగా గోరింటాకును చెట్టు నుండి సేకరించి సాంప్రదాయ బద్ధమైన పాటలు పాడుతూ ఒకరికొకరు గోరింటాకు పెట్టుకొన్నారు.ఈ సందర్భంగా గంగవ్వ మాట్లాడుతూ తన ఊరిలో మహిళలందరితో కలిసి ఆషాఢ మాసం ప్రారంభంలోనే గోరింటాకును పెట్టుకున్నామని, ఇది అనాదిగా వస్తున్న సాంప్రదాయమని ప్రతి ఒక్కరు మన ఆచారాలను పాటించాలని సూచించారు. న్యాయవాది భీమనాతిని ఉమాదేవి మాట్లాడుతూ భారతీయులు నిత్యం పాటించే ఆచారాలు, సాంప్రదాయాలు, పండగలు శాస్త్రీయమైనవని, ఆచారాల పట్ల అవగాహన లేక కొంతమంది వీటిని మూఢనమ్మకాలుగా భావిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ప్రశాంత రావు,భీమనాతిని ఉమాదేవి, సేవా భారతి జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, సభ్యులు శ్రీనివాస్, సంపూర్ణ చారి, మధుకర్, సత్యం, గంగాధర్, స్వప్న, స్రవంతి,కవోష్ణ,క విత,అశోక్,తదితరులు పాల్గొన్నారు.

# విధులు కొనసాగిస్తాం ... సమ్మెతో సంబంధం లేదు

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** ఉపాధి హామీ శాఖలో పనిచేస్తు జేఏసీ ఏర్పాటు చేసుకుని చేపడుతున్న నిరసన కార్యక్రమాలకు సమ్మెతో,ఫీల్డ్ అసిస్టెంట్లకు ఎలాంటి సంబంధం లేదని తాము విధులను యధావిధిగా కొనసాగిస్తామని మండల ఫీల్డ్ అసిస్టెంట్ లు అన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీ ఓ మహేశ్వర్ రెడ్డికి యూనియన్ తరపున వినతి పత్రాన్ని అందించారు. ఈజీఎస్ లో పనిచేస్తున్న ఏపీవోలు,ఈసీలు,టిఏలు,కంప్యూటర్ ఆపరేటర్లు చేస్తున్న నిరసన కార్యక్రమాలకు తమకు ఎలాంటి సంబంధం లేదని, తమ పనులు కొనసాగేలా ఏలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని వినతి పత్రంలో కోరారు.ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండల అధ్యక్షుడు దండు పెద్ది రాజన్న,రాకేష్, నవీన్, కార్తీక్, నరసయ్య,గంగాధర్, శ్రీనివాస్,తదితరులు ఉన్నారు.

# రోగ నిరోధక శక్తికి తల్లిపాలు ఎంతో శ్రేష్టం



**ప్రజాపక్షం/మల్లాపూర్ :** చిన్నారుల్లో రోగ నిరోధక శక్తిని పెంచేందుకు తల్లిపాలు ఎంతో శ్రేష్టమని రత్నాపూర్ సర్పంచ్ గొండ రాజేందర్,వెంకట్రావుపేట సర్పంచ్ కనుముల వెంకటేష్లు అన్నారు.ఈ సందర్భంగా రత్నాపూర్, వెంకట్రావు పేట గ్రామాలలో ఐసిడిఎస్ అంగన్వాడి ల ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. గర్భిణీలు బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే లాభాలు అనేకమని అంగన్వాడీ టీచర్లు అన్నారు.ఈ కార్యక్రమాలలో ఉప సర్పంచ్ గంగారెడ్డి, ఎం ఎల్ హెచ్ పి శైలజ, ఏఏన్ఎం కోమల, అంగన్వాడి టీచర్లు సంధ్యారాణి జమున పద్మావతి, ఆశ కార్యకర్తలు శారద రాణి పంచాయతీ పాలకవర్గ సభ్యులు,గర్భిణీలు,బాలింతలు పాల్గొన్నారు.

# గాయత్రి విద్యానికేతన్‌లో ఘనంగా వనమహోత్సవం




**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ :** పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్లో శనివారం రోజున వనమహోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమ ంలో భాగంగా విద్యార్థులకు మరియు వారి తల్లిదండ్రులకు సుమారు 1050 మొక్కలు గులాబీ మందార గన్నేరు ,జామ సపోటా అంజీర్ మల్బరీ ఉసిరి సీతాఫలం ,వివిధ రకాల పూలు, పండ్ల, ఔషధ మొక్కలను పంపిణీ చేశారు .ఈ సందర్భంగా గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్, కరస్పాండెంట్ రజనీ దేవి లు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం వనమహోత్సవాన్ని నిర్వహిస్తూ విద్యార్థుల్లో చిన్నప్పటి నుంచే ప్రకృతి పట్ల ప్రేమ,బాధ్యత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు తమ ఇళ్ల వద్ద ఈ మొక్కలను నాటి సంరక్షించడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు, వాటి ద్వారా లభించే పూలు, పండ్లను ఆనందంగా వినియోగిస్తున్నారని తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన లభిస్తోందని చెప్పారు.ఆ ప్రోత్సాహమే ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని మరింత ఉత్సాహంగా నిర్వహించేందుకు స్ఫూర్తినిస్తోందని పేర్కొన్నారు.అనంతరం విద్యార్థులు తాము అందుకున్న మొక్కలను ప్రేమతో నాటి, వాటిని బాధ్యతగా సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు.పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమం అందరి ప్రశంసలను అందుకుంది.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

# రాఘవపేట అభివృద్ధికి కలిసికట్టుగా పని చేద్దాం

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** మండలంలోని రాఘవపేట గ్రామ అభివృద్ధికి గ్రామస్తులు అంత కలిసికట్టుగా పనిచేద్దామని గ్రామ సర్పంచ్ తోట శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు గ్రామస్తులతో గ్రామసభ నిర్వహించారు.అనంతరం ఎల్ నినో ప్రభావం వల్ల ఏర్పడే నీటి కొరతపై, వ్యవసాయం తాగినటి సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై చర్చించి అవగాహన కల్పించారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలని పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మద్దెల నరసయ్య కార్యదర్శి మోహన్, వార్డు సభ్యులు లక్ష్మ య్య హామీనుద్దీన్, సాగర్ లక్ష్మి నరసయ్య సుశీల నరసయ్య రాము, వ్యవసాయ శాఖ వైద్య శాఖ విద్యుత్ శాఖ సిబ్బంది,అంగన్వాడి టీచర్లు నాయకులు కిరణ్ కమలాకర్ రాజు కుమార్,తదితరులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్లు ప్రజల మన్ననలను అందుకోవాలి

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** ఆటో డ్రైవర్లు బాధ్యతతో తమ కుటుంబాలను కాపాడుకుంటూ, ప్రజలకు తమ గమ్యస్థానాలను చేర్చుతూ ప్రజల మన్ననలను పొందాలని పెద్దపల్లి ఆటో డ్రైవర్ల గౌరవాధ్యక్షులు సయ్యద్ మసరత్ అన్నారు.శనివారం రోజున ఆటో డ్రైవర్ల దినోత్సవం పురస్కరించుకొని పెద్దపల్లి రైల్వేస్టేషన్లో కేక్ కట్ చేసి ఆటో డ్రైవర్లకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి పట్టణ ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ సభ్యులు,పలువురు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# గ్రీన్ ఫీల్డ్ హైవేపై 8 మీటర్ల కల్వర్టు

## సర్పంచ్ పోతుపెద్ది కవిత కిషన్ రెడ్డి


మం॥ ముత్తారం (మంథని), జి॥ పెద్దపల్లి, తెలంగాణ రాష్ట్రం - 505 184.
శ్రీమతి పోతిపెద్ది కవిత
సర్పంచ్
Cell: 9959039605, 8688564722

**ప్రజాపక్షం/ముత్తారం :**పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామ శివారులో నిర్మాణంలో ఉన్న గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారిపై రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు 8 మీటర్ల వెడల్పుతో కల్వర్టును నిర్మించాలని గ్రామ సర్పంచ్ పోతుపెద్ది కవిత కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు.ఈ మేరకు శనివారం సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు,రైతులు కలిసి జాతీయ రహదారి ప్రాజెక్టు డైరెక్టర్‌కు ఒక వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ..ఓడేడు గ్రామ పరిధిలోని వ్యవసాయ భూముల మీదుగా వర్షాకాలంలో భారీగా వరద నీరు ప్రవహిస్తుందని గుర్తు చేశారు.అంతేకాకుండా, సమీపంలోని మానేరు నది పొంగిపొర్లిన ప్రతిసారీ వరద నీరంతా ఇదే మార్గం గుండా వెళ్తుందని వివరించారు.ప్రస్తుతం జరుగుతున్న గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి పనుల వల్ల ఈ సహజ వరద నీటి ప్రవాహానికి పూర్తిగా ఆటంకం ఏర్పడే ప్రమాదం ఉందన్నారు.దీనివల్ల వరద నీరంతా రైతుల పొలాల్లోనే నిలిచిపోయి,పంటలు పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉందని సర్పంచ్ ఆందోళన వ్యక్తం చేశారు.రైతులకు జరగబోయే తీవ్ర నష్టాన్ని నివారించాలంటే, జాతీయ రహదారిపై తక్షణమే 8 మీటర్ల వెడల్పుతో కల్వర్టును నిర్మించాలని వారు కోరారు.కల్వర్టు నిర్మిస్తే వరద నీరు సజావుగా సాగిపోయి,వందలాది ఎకరాల వ్యవసాయ భూములు రక్షించబడతాయని తెలిపారు.రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారులు ఈ సమస్యపై ప్రత్యేక శ్రద్ధ వహించి,తక్షణమే కల్వర్టు నిర్మాణ పనులకు ఆదేశాలు జారీ చేయాలని సర్పంచ్ పోతుపెద్ది కవిత కిషన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# గుండెపోటుతో యువకుడు మృతి

**ప్రజాపక్షం/ముత్తారం :**పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం మచ్చుపేట గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన తోడేటి ప్రశాంత్ (33) సంవత్సరాలు గల యువకుడు అకస్మికంగా గుండెపోటుకు గురై మరణించారు. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం తెల్లవారుజామునే ఛాతిలో నొప్పి వస్తుందని చెప్పి కింద పడిపోయాడని అతన్ని హుటాహుటిన ఆస్పత్రికి తరలించే ప్రయత్నంలోనే మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య లావణ్య,మూడేళ్ల కూతురు ఉన్నారు.చిన్న వయసులోనే ప్రశాంత్ ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.కాగా ఈ మరణ వార్త తెలుసుకున్న గ్రామ సర్పంచ్ చిలువేరి జ్యోతిలక్ష్మ ణ్,ఉప సర్పంచ్ రాకేష్,వార్డు సభ్యులతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు ప్రశాంత్ భౌతికకాయాన్ని సందర్శించారు.ఆయన పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి,వారికి తమ గాఢ సానుభూతిని తెలియజేశారు.

## తాటిపల్లి గంగలో వింత చేప



ప్రజాపక్షం / కౌటాల : కౌటాల మండలం లోని తాటిపల్లి గంగలో వింత ఆకారంలో ఉన్న ఒక చేప లభ్యమవడం స్థానికంగా ఆసక్తి కలిగిస్తోంది. శనివారం జాలర్లు చేపల వేటకు వెళ్లిన సమయంలో శరీరంపై ప్రత్యేక నమూనాలతో ఉన్న ఈ చేప వలకు చిక్కింది. ఇప్పటి వరకు ఈ ప్రాంతంలో ఇలాంటి చేపను చూడలేదని స్థానికులు తెలిపారు. ఇది సక్కర్ మౌత్ క్యాట్‌ఫిష్ (ప్లెకో) జాతికి చెందినది అయి ఉండవచ్చని భావిస్తున్నారు. అధికారులు పరిశీలించి దీనిని నిర్ధారించాల్సి ఉంది.

## విధి నిర్వహణలో అంకితభావం ఉండాలి

ప్రజాపక్షం / సిర్పూర్ (టి) : అటవీ శాఖ సిబ్బంది విధుల పట్ల అంకితభావంతో పనిచేసి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్ తెలిపారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా టైగర్ ట్రాకింగ్‌లో విశేష సేవలు అందించిన సిర్పూర్ రేంజ్ అనిమల్ ట్రాకర్ ఎల్ములె రవీందర్ అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను సిర్పూర్ రేంజ్ అటవీ అధికారి శ్రీనివాస్, అటవీశాఖ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు, సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు, వాచర్లు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మండల అధ్యక్షులకు ఘన సత్కారం

ప్రజాపక్షం / జైనూర్ : జైనూర్, సిర్పూర్ (యు) కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగా నూతనంగా నియమితులైన మాజీ వైస్ ఎంపిపి షేక్ రషీద్, ఆత్రం శంకర్ లను ఖానాపూర్ ఎంఎల్‌ఏ వెడ్మ భోజ్జు పటేల్ ఘనంగా సన్మానించారు. శనివారం జైనూర్ మార్కెట్ కమిటీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారికి శాలువా కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ వెడ్మ భోజ్జు పటేల్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పార్టీ అధిష్ఠానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కాంగ్రెస్ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని షేక్ రషీద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్ రావ్, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ ముఖీద్, మండల సీనియర్ నాయకుడు మెస్రం అంబాజి, మాజీ వైస్ ఎంపిపి చిర్లే లక్ష్మణ్, సర్పంచ్ చందన్ షావ్, నాయకులు షేక్ రహీం, షేక్ అబ్బు, గంగారాం, మండాడి లింగు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మంత్రి వ్యాఖ్యలపై దుష్ప్రచారం మానుకోవాలి

ప్రజాపక్షం / రామకృష్ణాపూర్ : వర్షాలతో దెబ్బతిన్న జాతీయ రహదారి363 సర్వీస్ రోడ్డు, కల్వర్టును పరిశీలించిన సమయంలో మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి చేసిన వ్యాఖ్యలను బిఆర్ఎస్ నాయకులు ఉద్దేశపూర్వకంగా వక్రీకరించి సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయడం బాధ్యతారాహిత్యమని కాంగ్రెస్ పార్టీ రామకృష్ణాపూర్ పట్టణ అధ్యక్షుడు వొడ్నాల శ్రీనివాస్ విమర్శించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పనులు చేపట్టాలనే ఉద్దేశంతోనే మంత్రి అధికారులకు సూచనలు చేశారని, వాటిని రాజకీయ లబ్ధి కోసం వక్రీకరించడం సరికాదన్నారు. అసత్య ప్రచారాలు చేయడం బిఆర్ఎస్ రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని అన్నారు. భరత్‌నగర్‌దుబ్బపల్లి సర్వీస్ రోడ్డులో ప్రతి వర్షాకాలంలో ఎదురవుతున్న సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం మంత్రి వివేక్ వెంకటస్వామి కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ నిధులు, అనుమతులు తీసుకువస్తున్నారని తెలిపారు. సర్వీస్ రోడ్డు, బాక్స్ కల్వర్ట్, లైటింగ్ పనులను త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కౌన్సిలర్లు గుర్రం శ్రీనివాస్, ప్రభాకర్, మల్లేష్ శిరీష, నాయకులు యాకూబ్ అలీ, గోపు రాజ్యం, పల్లె రాజు, పొలం సత్యం, కార్యకర్తలు పాల్గొన్నారు.



# తల్లిపాలే శిశువుకు శ్రీరామరక్ష

ప్రజాపక్షం / జన్నారం : తల్లిపాలు శిశువుకు సంపూర్ణ ఆహారమే కాకుండా వ్యాధి నిరోధక శక్తిని పెంచే అమూల్యమైన వరమని హెల్త్ అసిస్టెంట్ కొల్లూరి కమలాకర్ తెలిపారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా జన్నారం మండలంలోని రాంపూర్ గ్రామపంచాయతీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిపాలు తాగే శిశువులు నిమోనియా, నీళ్ల విరేచనాలు వంటి వ్యాధుల బారిన పడే అవకాశం తక్కువగా ఉంటుందని చెప్పారు. తల్లి బిడ్డల మధ్య అనుబంధాన్ని బలోపేతం చేయడంతో పాటు పిల్లల్లో భద్రతాభావాన్ని పెంపొందిస్తాయని వివరించారు. తల్లులు బిడ్డలకు పాలివ్వడం వల్ల రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ వచ్చే ప్రమాదం తగ్గుతుందని, ప్రసవానంతరం రక్తస్రావం తగ్గడానికి, గర్భాశయం త్వరగా సాధారణ స్థితికి రావడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. పుట్టిన శిశువుకు తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే తప్పనిసరిగా అందించాలని, ఆ తర్వాత అదనపు ఆహారంతో పాటు తల్లిపాలను కొనసాగించాలని సూచించారు.గ్రామ సర్పంచ్ నూతి రామయ్య, ఉపసర్పంచ్ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి రమేష్, హెల్త్ అసిస్టెంట్ మాధవి, ఆశా కార్యకర్తలు రాజమణి, వసంత, అంగన్‌వాడీ కార్యకర్తలు సంధ్యారాణి, విజయ, సుశీల పాల్గొన్నారు.



## ఆర్‌టిసి విశ్రాంతి ఉద్యోగుల బకాయిలను విడుదల చేయాలి

ప్రజాపక్షం / కాగజ్‌నగర్ : టిజిఎస్‌ఆర్‌టిసి విశ్రాంతి ఉద్యోగుల బకాయిల సమస్యలను అసెంబ్లీలో చర్చించి వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఆర్‌టిసి విశ్రాంతి ఉద్యోగులు శనివారం సిర్పూర్ నియోజకవర్గం ఎంఎల్ఎ పాల్వాయి హరీష్ బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెలకు రూ. 2,500 నుంచి రూ. 3,000 మాత్రమే ఇపిఎఫ్ పెన్షన్ వస్తుండటంతో జీవనం కష్టంగా మారిందన్నారు. 2017 నుంచి రావలసిన వేతన సవరణ బకాయిలు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, గ్రాట్యుటీ మొత్తాలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. రిటైర్డ్ ఉద్యోగులు, వారి జీవిత భాగస్వాములకు సూపర్ లగ్జరీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని, రేషన్ కార్డులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇపిఎఫ్ పెన్షన్ పెంపుపై కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి ఉద్యోగులు పి. దివాకర్, మోతే రాజన్న, అజ్గర్ పాషా, మహబూబ్ అమీర్, శ్రీనివాస్, మెహబూబ్, గులాం మహమ్మద్, మొహినుద్దీన్, ఎండికే పాషా, హనుమంతు, చిన్న మైబూబ్, సాబీర్ పాల్గొన్నారు.



# భూగర్భ గనుల్లో 95 శాతం ఉత్పత్తి

ప్రజాపక్షం / శ్రీరాంపూర్ : శ్రీరాంపూర్ ఏరియాలోని గనులు క్వాలిటీ విషయంలో 80 శాతం గ్రేడ్ సాటిస్ఫాక్షన్ సాధించి, సంస్థలోనే మొదటి స్థానంలో నిలిచాయని జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ తెలిపారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలై నెలలో నిర్దేశించిన 4,11,500 టన్నుల ఉత్పత్తి లక్ష్యానికి గాను 2,37,407 టన్నుల ఉత్పత్తి సాధించినట్లు వెల్లడించారు. భూగర్భ గనుల్లో ఎస్ఆర్‌పి 1 గని 104 శాతం, ఆర్‌కే7 గని 100 శాతం ఉత్పత్తి సాధించగా, మొత్తంగా భూగర్భ గనులు 95 శాతం ఉత్పత్తి సాధించాయని పేర్కొన్నారు. జూలై చివరి వారంలో కురిసిన భారీ వర్షాల ప్రభావంతో ఓపెన్ కాస్ట్ గనుల్లో ఉత్పత్తి తగ్గిందన్నారు. ఇందారం ఓసీలో కొత్త కాంట్రాక్ట్ ప్రారంభం కానుండటంతో బొగ్గు ఉత్పత్తి, ఓబి తొలగింపు పెరుగుతుందని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా భూగర్భ గనుల్లో భద్రతా చర్యలు బలోపేతం చేశామన్నారు. ఆర్జీ1లో జరిగిన 56వ వార్షిక భద్రతా పక్షోత్సవాల బహుమతుల ప్రదానోత్సవంలో ఏరియా గనులు 19 బహుమతులు సాధించాయని తెలిపారు. కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ మెడికల్ ఇన్వాలిడేషన్ పొందిన ఉద్యోగుల వారసుల్లో 3,856 మందికి డిపెండెంట్ ఉద్యోగాలు కల్పించామని, 9,773 మందికి సిపిఆర్ఎంఎస్ కార్డులు అందజేసినట్లు వివరించారు. ఈ సమావేశంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## మహిళల సాధికారతకు నిదర్శనం సంఘ భవనం

ప్రజాపక్షం/నేరడిగొండ: నేరడిగొండ మండలం సవర్గావ్‌లో నూతనంగా నిర్మించిన మహిళా సమాఖ్య భవనాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శనివారం ప్రారంభించారు.ఈ భవనం మహిళా సాధికారతకు నిదర్శనమని, దీనిని ఆదర్శంగా తీసుకుని ఇతర గ్రామాల సర్పంచులు కూడా సంఘ భవనాలను పూర్తి చేయాలని సూచించారు. ప్రతి ఇల్లు ఇంకుడు గుంతను నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. కాగా, కుంటాల సర్పంచ్ ఆత్రం గంగారాం తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ నుంచి తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేరగా, ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వారికి కండువా కప్పి ఆహ్వానించారు.

## తల్లిపాల వారోత్సవాల సందర్భంగా టీకాలు

ప్రజాపక్షం / మందమర్రి : ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మందమర్రి పట్టణంలోని ఇందిరానగర్ అంగన్వాడీ సబ్‌సెంటర్‌లో గర్భిణులకు టీటీ ఇంజెక్షన్లు, టీకాలు వేసినట్లు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. ఆగస్టు 1 నుంచి 7 వరకు జరిగే ఈ వారోత్సవాల్లో భాగంగా శనివారం మూడో నెల, ఐదో నెల నిండిన గర్భిణులకు టీకాలు వేసి, అవగాహన కల్పించారు. శిశువుకు సంపూర్ణ ఆహారంగా తల్లిపాలు అందించాలని, బిడ్డకు తల్లిపాలను మించిన ఆహారం లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## పంట పొలాల్లో నీటిని తొలగించాలి

ప్రజాపక్షం / సిర్పూర్ (టి) : అధిక వర్షాల వల్ల పంట పొలాల్లో నిలిచిన నీటిని తక్షణమే తొలగించాలని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. మధు సూచించారు. కాగజ్‌నగర్ డివిజన్ సిర్పూర్ మండలంలోని లక్ష్మీపూర్, తొంకిని, పారిగాం, లోనవెల్లి గ్రామాల్లో పత్తి, వరి పంటలను ఆయన పరిశీలించారు.కాలువల ద్వారా 24 నుంచి 48 గంటల్లోపు నీటిని బయటకు పంపాలని తెలిపారు. ఆ తర్వాత లీటర్ నీటికి 10 గ్రాముల 19:19:19 కలిపి పిచికారీ చేయాలని స్పష్టం చేశారు. వర్షాలు తగ్గిన తర్వాతే యూరియా వంటి ఎరువులు వేయాలని, లేకపోతే కొట్టుకుపోయి నష్టం జరుగుతుందన్నారు. వారం తర్వాత అంతర కృషి చేసుకుని ఎకరానికి 25 కిలోల యూరియా, 10 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులు వేసుకోవాలని సూచించారు. వరి నాటిన మొదటి 30 రోజుల వరకు కలుపు లేకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. వరి విత్తిన 3 నుంచి 5 రోజుల లోపు ఎకరానికి 36 గ్రాముల ఆక్సాడైఆర్జిల్ 80 శాతం డబ్ల్యూపి ని 20 కిలోల ఇసుకలో కలిపి చల్లుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి. గిరీషన్, లక్ష్మీపూర్ గ్రామ సర్పంచ్ రాందాస్, రైతులు పాల్గొన్నారు.

## అన్నాభావు సాఠే జయంతి వేడుకలు

ప్రజాపక్షం/వాంకిడి : ప్రముఖ దళిత సాహిత్యవేత్త, ప్రజా రచయిత అన్నాభావు సాఠే 106వ జయంతి వేడుకలను వాంకిడి మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అశోక్ మహుల్కర్ మాట్లాడుతూ కమ్యూనిస్టు నాయకుడిగా ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్న అన్నాభావు సాఠే, అంబేద్కర్ భావజాలాన్ని స్వీకరించి గొప్ప అంబేద్కరిస్టు సాహిత్యవేత్తగా గుర్తింపు పొందారని కొనియాడారు. వర్షవాస్ కమిటీ అధ్యక్షుడు దుర్గం దొందుజి శ్యాంరావు, సిపిఐ రాష్ట్ర నాయకుడు ఒంద్రే గోపీనాథ్, సమాజ అధ్యక్షుడు దుర్గం లహుజి శ్యాంరావు, బౌద్ధ ఉపాసకులు పొందం జాడే, దొంగ్రే భిక్షపతి, చునార్కర్ నూతన్, ప్రశాంత్ జాడే, దుర్గం పోత పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు గురుకుల విద్యార్థులు

ప్రజాపక్షం/హాజీపూర్ : జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో ముల్కల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆగస్టు 7, 8 తేదీలలో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ రాష్ట్ర స్థాయి పోటీలు జరగనున్నాయి. అండర్08 విభాగంలో ఎం. గణేష్, అండర్10 విభాగంలో జి. రిత్విక్, బి. కార్తీక్, అండర్12 విభాగంలో జి. సాయి చరణ్, అండర్16 విభాగంలో ఎ. యశ్వంత్ రాష్ట్ర స్థాయికి అర్హత సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు అభినందించారు.

## వంతెన లేక బుర్కా రేగడికి రాకపోకలు బంద్

ప్రజాపక్షం/పెంబి : పెంబి మండలం బుర్కా రేగడి వాసులకు వాగు దాటే తిప్పలు తప్పడం లేదు. స్వల్ప వర్షానికే వాగు పొంగిపొర్లడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించిపోతున్నాయి. అటవీ శాఖ అనుమతులు ఇస్తేనే రోడ్డు, వంతెన నిర్మిస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. నిబంధనల పేరుతో ఏళ్లుగా పనులు నిలిచిపోవడంతో అత్యవసర వేళ తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ జెడ్పిటిసి

ప్రజాపక్షం/లోకేశ్వరం : లోకేశ్వరం మండలంలోని కాండ్లి గ్రామ సర్పంచ్ వెంకటేష్ నానమ్మ ఇటీవల అనారోగ్యం తో మృతి చెందారు అలాగే పిప్రి గ్రామంలోని మాజీ ఎంపీటీసీ రాణి అనీల్ వారి నానమ్మ అనారోగ్యంతో మృతి చెందారు.విషయం తెలుసుకున్న మాజీ జిల్లా జడ్పీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ మరియు బిఆర్ఎస్ నాయకులు వారికి మనోధైర్యాన్ని తెలుపుతూ వారి ఆత్మ శాంతి చేకూరాలని ప్రగాఢ సానుభూతి తెలిపారు.పరామర్శించిన వారిలో టిఆర్ఎస్ మండల కన్వీనర్ కరికే శ్యాంసుందర్,మాజీ పిఎసిఎస్ చైర్మన్ చిన్నారావు,మాజీ ఎంపీపీ లక్ష్మీ సాగర్,సర్పంచ్ సాయన్న చిన్నయ్య,ఎర్రవ్వ దిగంబర్ , బండి ప్రశాంత్,అనిల్,సందీప్ పాల్గొన్నారు.

## పోడు భూముల్లో సాగు చేస్తున్న గిరిజన రైతులకు ఇబ్బందులు పెడితే ఊరుకోం

### ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

ప్రజాపక్షం/భైంసా : పోడు భూముల్లో గత పది సంవత్సరాల నుండి పంట సాగు చేస్తున్న గిరిజన రైతులకు ఇబ్బందులు పెడితే ఊరుకునే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ హెచ్చరించారు.శనివారం కుబీర్ మండలంలో మండల ప్రత్యేక సమావేశం జరగగా ఆయన ఫారెస్ట్ అధికారులతో మాట్లాడారు. పోడు భూములను నమ్ముకుని గిరిజనులు జీవనం కొనసాగిస్తున్నారని,వారిని ఇబ్బందులు పెడితే ప్రజా ప్రతినిధులు అంతా కలిసి ఆందోళన బాట పడతామన్నారు.

### ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రం గా ఉంచుకోవాలి

ప్రజాపక్షం/పెంబి : ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రం గా ఉంచుకోవాలని పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి చేపట్టాలని మండల స్పెషల్ అధికారి లింగయ్య అన్నారు.శనివారం మండలం లోని జంగు గూడా గ్రామం లో పరిసరాల ను పరిశీలించారు, అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలు పరిసరాలను పరిశుభ్రం గా ఉంచుకోవాలని,గుంత లో నీరు నిల్వ ఉండకుండా, చూసుకోవాలని అన్నారు పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని,పరిశుభ్రమైన వాతావరణం ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని అన్నారు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పరిశుభ్రమైన,సురక్షితమైన వాతావరణం కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపర్చేందుకు ప్రజలందరూ సహకరించాలని అధికారులు కోరారు. ఏ పి డి ఉషా ప్రసాద్, ఎంపీడీఓ రాజశేఖర్,సర్పంచ్ శశి కల శంకర్,ఉప సర్పంచ్ గంగారాం అంగన్వాడీ టీచర్ బట్టి రాణి,గ్రామస్థులు పాల్గొన్నారు.

## అడుగడుగునా స్పీడ్ బ్రేకర్లు.. ప్రయాణం భారమా..?

### వేగం తగ్గి.. సమయం, ఇంధనం వృథా..!

### ఆరోగ్యంపై కూడా ప్రభావమని ఆందోళన




ప్రజాపక్షం/నిర్మల్ : నిర్మల్ జిల్లా కేంద్రం నుండి భైంసా పట్టణానికి వెళ్లే జాతీయ రహదారి–61 పై అడుగడుగునా ఏర్పాటు చేసిన రంబుల్ స్పీడ్ బ్రేకర్లు వాహనదారులకు తీవ్ర ఇబ్బందిగా మారాయి. కొద్ది దూరానికే వరుసగా స్పీడ్ బ్రేకర్లు ఉండటంతో వాహనాల వేగం పదేపదే తగ్గించాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ముఖ్యంగా ప్రతిరోజూ ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు, రైతులు ఈ మార్గంలో ప్రయాణిస్తుండటంతో వారి ప్రయాణం నెమ్మదిగా, భారంగా మారిందని చెబుతున్నారు.నిర్మల్ నుంచి భైంసా వరకు ఉన్న రహదారిలో గ్రామాలు, కూడళ్లు, పాఠశాలల సమీపంలో భద్రత కోసం స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడం అవసరమే అయినప్పటికీ, ప్రస్తుతం అవసరానికి మించి అనేక చోట్ల రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయడం వల్ల ప్రయోజనం కంటే ఇబ్బందులే ఎక్కువగా ఉన్నాయని వాహనదారులు అంటున్నారు.ప్రతి కొద్ది దూరానికే వేగం తగ్గించి మళ్లీ పెంచాల్సి రావడంతో ప్రయాణ సమయం పెరగడమే కాకుండా ఇంధన వినియోగం కూడా అధికమవుతోందని పేర్కొంటున్నారు.ద్విచక్ర వాహనదారులు ఈ మార్గంలో ప్రయాణించేటప్పుడు ఎక్కువ కుదుపులకు గురవుతున్నారు. కార్లు, ఆటోలు, బస్సులు, లారీలు కూడా ప్రతి స్పీడ్ బ్రేకర్ వద్ద బ్రేక్ వేయాల్సి రావడంతో వాహనాల సస్పెన్షన్ వ్యవస్థ, షాక్ అబ్జార్బర్లు,టైర్లపై అదనపు భారం పడుతోందని మెకానిక్‌లు చెబుతున్నారు.దీని వల్ల వాహనాల నిర్వహణ ఖర్చులు కూడా పెరుగుతున్నాయని వాహన యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అంతే కాకుండా ప్రతిరోజూ ఈ మార్గంలో ప్రయాణించే వారికి నడుము నొప్పి,మెడ నొప్పి, వెన్నునొప్పి వంటి శారీరక అసౌకర్యాలు ఎదురవుతున్నాయని ప్రయాణికులు చెబుతున్నారు. వృద్ధులు, గర్భిణీలు,చిన్నారులకు ఈ కుదుపులు మరింత ఇబ్బందికరంగా మారుతున్నాయని అంటున్నారు. ఇప్పటికే వెన్నెముక లేదా కీళ్ల సమస్యలు ఉన్నవారికి ఈ ప్రయాణం మరింత కష్టంగా మారుతోందని వైద్యులు కూడా సూచిస్తున్నారు.అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలు సైతం ఈ రహదారిపై వేగంగా ప్రయాణించలేకపోతున్నాయని స్థానికులు చెబుతున్నారు. వరుసగా స్పీడ్ బ్రేకర్లు ఉండటంతో అత్యవసర సేవల స్పందన సమయం కూడా పెరిగే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.భారత రోడ్ల కాంగ్రెస్ మార్గదర్శకాల ప్రకారం జాతీయ రహదారులపై అవసరమైన చోట్ల మాత్రమే ప్రమాణాలకు అనుగుణంగా రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలని నిబంధనలు ఉన్నాయని వాహనదారులు గుర్తుచేస్తున్నారు. కాబట్టి నిర్మల్–భైంసా జాతీయ రహదారిపై ఉన్న స్పీడ్ బ్రేకర్లపై సంబంధిత జాతీయ రహదారుల అధికారులు సమగ్ర పరిశీలన నిర్వహించి, అవసరం లేని వాటిని తొలగించి, ప్రమాణాలకు అనుగుణంగా మాత్రమే ఉంచాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. దీంతో ప్రయాణం సురక్షితంగా ఉండటంతో పాటు సమయం, ఇంధనం, వాహనాల నిర్వహణ ఖర్చులు కూడా తగ్గే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.

## అన్నా భాహు సాఠే 106వ జయంతి వేడుకలు

ప్రజాపక్షం/భైంసా : బహుజన్ సాహిత్య ఉద్యమానికి మార్గదర్శకుడు, కార్మిక, దళిత ప్రజల గొంతుక అయిన అన్నా భాహు సాఠే 106వ జయంతి ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అన్నబాహు సాఠే సంఘం ఆధ్వర్యంలో భైంసా పట్టణం లోని అన్నా భావు సాఠే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నిర్మల్ జిల్లా నాయకులు సుంకెట మహేష్ బాబు హాజరై మాట్లాడారు.అన్నా భాహు సాఠే పేదరికంలో పుట్టి,కూలీగా పని చేస్తూనే గొప్ప రచయిత అయ్యారు. దళిత, కార్మిక వర్గాల బాధలను ప్రపంచానికి చాటి చెప్పారు. ఆయన త్యాగం నేటికీ కార్మికుల పోరాటానికి స్ఫూర్తినిస్తోంది అని తెలిపారు.అన్నా భాహు సాఠే చదువే సమానత్వానికి మార్గం అని నమ్మారు.ఆయన ఆశయాలైన సామాజిక సమానత్వం, విద్య, ఆత్మగౌరవం కోసం మనం పని చేయాల్సిన అవసరం ఉంది అని కొనియాడారు.ఆయన కలమే ఆయుధం అని చాటి, పేద, దళిత, కార్మిక ప్రజల జీవితాలను తన రచనలతో వెలుగులోకి తెచ్చారు.ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరం ఆచరిద్దాం.ఈ కార్యక్రమంలో అన్నబాహు సాఠే కమిటీ నాయకులు, కొత్తూరు శంకర్,సాహెబ్ రావ్,మారుతి,బాబు,కాంబ్లె సాహెబ్ రావ్,లక్ష్మ ణ్,రవి,నాగేష్,యువకులు,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## గ్రామీణ రహదారుల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి

### ఎమ్మెల్యే పవార్ రామారావు పటే ల్

ప్రజాపక్షం/భైంసా : మారుమూల మండలమైన కుభీర్ మండలంలో ప్రధాన రహదారుల నిర్మాణం పై దృష్టి సారించనున్నట్లు ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ తెలియజేశారు.శనివారం కుభీర్ నుండి దోడర్న తండా 2 పనులకు 98 లక్షల నాన్ గ్రాంట్ ప్లాన్ నిధులతో పనులను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు.రహదారి నిర్మాణానికి నిధులు సరిపోవని గ్రామస్తులు తెలియజేయడం తో కోటి రూపాయల నిధులు మాంజురు చేయనున్నట్లు చెప్పారు.అదే విధంగా భైంసా నుండి నిఘ్వ మహారాష్ట్ర బోర్డర్ వరకు 22 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. 42 కోట్ల హామ్ నిధులతో సిరిపెల్లి నుండి పల్సి పార్సి కె మీదుగా కుభీర్ వరకు డబుల్ లైన్ రోడ్ వేస్తున్నామన్నారు.టెండర్ ప్రక్రియ సైతం పూర్తి కావడం జరిగిందన్నారు.కార్యక్రమం లో ఆర్ అండ్ బి అధికారులు,సీనియర్ నాయకులు బోయిడి విఠల్,వడ్నం నాగేష్,రాథోడ్ శంకర్ బిజెపి మండల అధ్యక్షులు యేశాల దత్తాత్రి,సర్పంచ్ లు,బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## గుండంపల్లి రైతు వేదికలో పిజెటిఎస్ఎయు విద్యార్థుల పీఆర్ఏ కార్యక్రమం

ప్రజాపక్షం/దిలావర్ పూర్ : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం (పిజెటిఎస్ఎయు) నాలుగో సంవత్సరం గ్రామీణ వ్యవసాయ కార్యానుభవ కార్యక్రమం (ఆర్ఏడబ్ల్యుఈ) విద్యార్థులు గుండంపల్లి గ్రామంలోని రైతు వేదికలో పార్టిసిపేటరీ రూరల్ అప్రైజల్ (పిఆర్ఏ) కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు గ్రామంలోని సహజ వనరులు, వ్యవసాయ విధానాలు,పంటల సాగు, సామాజికఆర్థిక పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు తదితర అంశాలపై వివిధ పిఆర్ఏ సాధనాల ద్వారా సమాచారాన్ని సేకరించారు.అలాగే గ్రామంలో ట్రాన్సెక్ట్ వాక్ నిర్వహించి, వ్యవసాయ భూములు,నీటి వనరులు, నేల రకాలు,పంటల స్థితి మరియు గ్రామంలోని వనరులను ప్రత్యక్షంగా పరిశీలించి రైతులతో చర్చించారు.

## మొక్కలు నాటడం ప్రతీ ఒక్కరి బాధ్యత

ప్రజాపక్షం/రెబ్బన : జీవకోటికి ప్రధాన ఆధారమైన మొక్కలను నాటడమే కాకుండా వాటి సంరక్షణను బాధ్యతగా తీసుకోవాలని సర్పంచ్ లక్ష్మి పిలుపునిచ్చారు. వన మహోత్సవంలో భాగంగా రాజారం గ్రామ పంచాయతీ పరిధిలోని చిలుకమారిగూడెం ప్రాథమిక పాఠశాల ఆవరణలో శనివారం మొక్కలు నాటారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎరువోతుల శ్రీధర్, గ్రామ పెద్ద ఒరగంటి గణేష్, వార్డు సభ్యుడు ఆవుల సాగర్, ఫీల్డ్ అసిస్టెంట్ స్వప్న, పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పేరుకే వంద పడకల ఆసుపత్రి.. వైద్యుల కొరత

ప్రజాపక్షం / బెల్లంపల్లి : బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసి అవసరమైన వైద్యులను నియమించాలని ఎంసిపిఐయు పార్టీ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ డిమాండ్ చేశారు. శనివారం వారు ఆసుపత్రిని సందర్శించి వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడు మండలాల ప్రజలకు పెద్దదిక్కైన ప్రభుత్వ ఆసుపత్రిని ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. గత ప్రభుత్వం వంద పడకల ఆసుపత్రి అని బోర్డు పెట్టినా ఇంతవరకు అప్‌గ్రేడ్ కాలేదని తెలిపారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ స్పందించి గైనకాలజిస్ట్, సర్జన్లు, పిల్లల డాక్టర్లు, ఆర్థోపెడిషన్లను నియమించి ఆధునిక వైద్యం అందించాలన్నారు. ఉన్న సిబ్బందిని వేరే చోట్లకు డిప్యుటేషన్ పై పంపుతున్నారని ఆరోపించారు. ఆసుపత్రి ముందు ఆర్‌టిసి బస్ స్టాప్ ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో ఆసుపత్రి ముందు నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాపు, పోలోజి రామకృష్ణ, తోగరి రాహుల్ పాల్గొన్నారు.

## జులైలో 106 శాతం బొగ్గు ఉత్పత్తి

ప్రజాపక్షం / మందమర్రి : జూలై నెలలో మందమర్రి ఏరియా 106 శాతం బొగ్గు ఉత్పత్తితో పాటు 105 శాతం ఓవర్ బర్డెన్ (ఓబి) తొలగింపు లక్ష్యాన్ని సాధించిందని ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ తెలిపారు. శనివారం మందమర్రి ఏరియా జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కెకె05, కెకె ఓసి గనులు 100 శాతం ఉత్పత్తి సాధించాయని, ఈ విజయానికి కృషి చేసిన ఉద్యోగులు, అధికారులకు అభినందనలు తెలిపారు. అండర్‌గ్రౌండ్ గనుల్లో గైర్హాజరును తగ్గించి 100 శాతం ఉత్పత్తి, భద్రత, నాణ్యత సాధించాలని సూచించారు. కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ సిఎంపిఎఫ్, పెన్షన్ల సమస్యలను వెంటవెంటే పరిష్కరిస్తున్నామన్నారు. భారీ వర్షాలతో ఆర్కే పూర్ లో ఇళ్లు దెబ్బతిన్న బాధిత కుటుంబాలకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని, అలాగే సింగరేణి రెస్క్యూ బృందం రోడ్లపై కూలిన చెట్లను తొలగించి రవాణాను పునరుద్ధరించిందని వివరించారు. ఈ సమావేశంలో ఏరియా ఇంజనీర్ బాలాజీ భగవతీ జా, డిజిఎం అశోక్, డిజిఎం కిరణ్ కుమార్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

## ఆటో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

ప్రజాపక్షం / శ్రీరాంపూర్ : రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆటో కార్మికులను ఆదుకోవడానికి రూ. 1000 కోట్ల నిధులతో ఆటో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ప్రతి ఆటో డ్రైవర్ కు రూ. 30 వేల సహాయం అందించాలని గౌరవ అధ్యక్షుడు చెల్ల విక్రమ్ డిమాండ్ చేశారు. శనివారం సిసిసి ఎక్స్ రోడ్ వద్ద ఆటో కార్మిక దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో కార్మికులు ఉపాధి కోల్పోయారని, ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే భవిష్యత్తులో వేలాది మందితో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పులి రాజేందర్ గౌడ్, ఆవుల సుధాకర్, రాగిడి రాజు, కుమ్మరి రాజకుమార్, చిరంజీవి, బాపు పాల్గొన్నారు.



# మరణాన్ని విక్రయిస్తున్న 'గుట్కా' ముఠాలు!

నిద్రపోతున్న నిఘా.. కాసులు కురిపిస్తున్న క్యాన్సర్ దందా!




**ప్రజాపక్షం/నిర్మల్ :** రాష్ట్రంలో సంపూర్ణంగా నిషేధించినా నిర్మల్ జిల్లాలో గుట్కా, తంబాకు, ఖైనీ వంటి ప్రాణాంతక మత్తు పదార్థాల విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. పక్కనే ఉన్న మహారాష్ట్ర సరిహద్దుల గుండా రోజూ లక్షలాది రూపాయల నిషేధిత ఉత్పత్తులు జిల్లాలోకి ప్రవేశిస్తున్నాయి. చట్టాల్లోని సందు గొందులు, అధికారుల లాలూచీ, స్థానిక అక్రమార్కుల నెట్‌వర్క్ కలసి జిల్లాను మత్తు పదార్థాలకు ప్రధాన అడ్డాగా మార్చేశాయి. పోలీసుల తనిఖీలు సరిహద్దుల వద్ద అంతంతమాత్రంగానే ఉండటంతో ముఠాలు మరింత తెగబడిపోతున్నాయి.

**మహారాష్ట్ర సరిహద్దులే రహస్య మార్గాలు :** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా, ముఖ్యంగా నిర్మల్ ప్రాంతం మహారాష్ట్రలోని నాందేడ్, కిన్వట్, ధర్మాబాద్, భోకర్ సరిహద్దులకు అత్యంత చేరువలో ఉండటం అక్రమార్కులకు వరంగా మారింది. మహారాష్ట్ర నుంచి లారీలు, పండ్ల రవాణా వాహనాలు, ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలపై రహస్యంగా గుట్కా బస్తాలను తరలిస్తున్నారు. సరిహద్దు మండలాలైన కుభీర్, భైంసా, తానూర్, లోకేశ్వరం, ముధోల్ ప్రాంతాల మీదుగా సరుకు నిర్మల్ టౌన్, ఖానాపూర్, దస్తురాబాద్ వరకూ చేరుకుంటోంది. అక్కడ నుంచి గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న చిన్న కిరాణా కొట్లు, పాన్ డబ్బాల దాకా హోల్‌సేల్‌గా సరఫరా అవుతోంది.

నెలకు కోట్లల్లో దందా.. ఏకంగా 300% లాభం! నిర్మల్ జిల్లావ్యాప్తంగా నెలకు రూ. 5 కోట్ల నుంచి రూ. 8 కోట్ల వరకు ఈ గుట్కా వ్యాపారం సాగుతున్నట్లు అంచనా. ప్రభుత్వ నిషేధం ఉన్నందున రూ. 5 విలువైన ప్యాకెట్‌ను రూ. 20 నుంచి రూ. 30 వరకు అమ్ముతున్నారు. ఈ వ్యాపారంలో 200 నుంచి 300 శాతం వరకు మార్జిన్ లాభాలు ఉండటంతో, గుట్కా మాఫియా ఏమాత్రం జంకూ గొంకూ లేకుండా దందాను విస్తరిస్తోంది. పోలీసులకు పట్టుబడినా చట్టంలోని సందుల ఆధారంగా బెయిల్ పొంది బయటకు రావడం, మళ్లీ పాత దందాలోనే దిగడం వీరికి పరిపాటిగా మారింది.

**యువతే ప్రధాన లక్ష్యం.. ఛిద్రమవుతున్న జీవితాలు** పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, హాస్టళ్ల సమీపంలోని పాన్ షాపులే ఈ అక్రమార్కులకు ప్రధాన విక్రయ కేంద్రాలుగా మారాయి. రంగురంగుల ప్యాకెట్లలో దొరికే ఈ గుట్కాలు, పాన్ మసాలాలకు అలవాటుపడి అనేకమంది విద్యార్థులు, యువకులు ఆరోగ్యాన్ని నాశనం చేసుకుంటున్నారు. చిన్న వయసులోనే నోటి క్యాన్సర్, ఇతర ప్రాణాంతక వ్యాధుల బారిన పడి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. భవిష్యత్తు తరాలను నాశనం చేస్తున్న ఈ విషసంస్కృతికి అడ్డుకట్ట వేయకపోతే పరిస్థితి తీవ్రంగా మారే ప్రమాదం ఉంది.పోలీసు నిఘా ఏది? టాస్క్‌ఫోర్స్ దాడి ఏది? గతంలో జిల్లా పోలీసు యంత్రాంగం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి, నిరంతర వాహన తనిఖీలతో పాటు నిందితులను పీడీ యాక్ట్ కింద జైలుకు పంపింది. కానీ, ఇటీవల సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిఘా కనుమరుగైందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల చూసీచూడనట్లు వ్యవహరించే వైఖరే అక్రమార్కులకు ఊపిరి పోస్తోందని స్థానికులు మండిపడుతున్నారు.

**తక్షణ చర్యలు అవసరం :** ఇప్పటికైనా జిల్లా ఎస్పీ, కలెక్టర్, ఆహార భద్రతా అధికారులు (ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్) కలసి సంయుక్తంగా స్పందించాలి. మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల వద్ద తనిఖీ పాయింట్లు పెంచి, పాన్ షాపులు, గోదాములపై ఆకస్మాత్తుగా దాడులు జరపాలి. కేవలం చిన్న డ్రైవర్లు, వ్యాపారులపైనే కాకుండా గుట్కా సామ్రాజ్యాన్ని శాసిస్తున్న అసలు సూత్రధారులపై కఠిన చట్టాల కింద కేసులు నమోదు చేసినప్పుడే ఈ నల్ల దందాకు శాశ్వత ముగింపు లభిస్తుంది.

# అన్నబాహు సాటే ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలి

ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్

**ప్రజా పక్షం/బైంసా :** అన్న బహు సాటే ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు నడుచుకోవాలని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ సూచించారు.శనివారం 106వ అన్న బహు సాటే జయంతి సందర్భంగా భైంసా పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన సందర్భంగా మాట్లాడారు.మహనీయుడు అన్నాబహు రచనలు సమాజాన్ని ఎంతో ప్రభావితం చేశాయన్నారు. అణగారిన వర్గాల కోసం పోరాడిన వ్యక్తి ఆయనే అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి, తదితరులు పాల్గొన్నారు.

# మెనూ ప్రకారం భోజనం అందించాలి

తహసిల్దార్ ఆడె కమల్ సింగ్

**ప్రజాపక్షం /కుంటాల :** మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసిల్దార్ ఆడె కమల్‌సింగ్ అన్నారు . శనివారం మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు.విద్యార్థులు భోజనం చేస్తుండగా వారి వద్దకు వెళ్లి భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. మెనూ పాటిస్తున్నారా అని ఆరా తీశారు.కిచెన్ గోదాంలో బియ్యం, పప్పులు, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు.ఉపాధ్యాయులు,సిబ్బంది ఉన్నారు.

# ఇ20 పెట్రోల్‌పై కేజ్రీవాల్ లైవ్ ప్రసారం వీక్షించిన నిర్మల్ ఎఎపి నాయకులు

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** ఆమ్ ఆద్మీ పార్టీ (ఎఎపి) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఇ20 పెట్రోల్ వినియోగం వల్ల తలెత్తుతున్న సమస్యలపై నిర్వహించిన ప్రత్యక్ష ప్రసారాన్ని (లైవ్ వీడియో) నిర్మల్ జిల్లా ఎఎపినాయకులు, కార్యకర్తలు వీక్షించారు. రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ సయ్యద్ హైదర్ ఆధ్వర్యంలో వీరంతా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కేజ్రీవాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇ20 పెట్రోల్ విధానం వల్ల పాత వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీనివల్ల మైలేజ్ తగ్గడంతో పాటు వాహనాల నిర్వహణ వ్యయం పెరిగి సామాన్య ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడుతోందని వివరించారు. ప్రజల నుంచి వస్తున్న ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని కేంద్ర ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.అనంతరం జిల్లా నాయకులు మాట్లాడుతూ E20 పెట్రోల్ అంశంపై ప్రజల ప్రయోజనాలను పరిరక్షించేందుకు ఆమ్ ఆద్మీ పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

# ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపునకు ఈనెల 17 చివరి తేదీ

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ ఏడాది అక్టోబర్‌లో నిర్వహించనున్న పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరుకావలిచిన విద్యార్థులు ఎలాంటి అపరాధ రుసుము (ఫైన్) లేకుండా ఈనెల 17వ తేదీ లోపు పరీక్ష ఫీజు చెల్లించాలని నిర్మల్ జిల్లా విద్యాశాఖ అధికారి దర్శన భోజన్న తెలిపారు. అలాగే, ప్రతి పేపర్‌కు రూ. 25 ఆలస్య రుసుముతో ఆగస్టు 24 వరకు, రూ. 50 అపరాధ రుసుముతో ఆగస్టు 29 వరకు ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. ఇక చివరి అవకాశంగా తాత్కాల్ స్కీం కింద సెప్టెంబర్ 2వ తేదీ వరకు విద్యార్థులు తమ పరీక్ష ఫీజును చెల్లించవచ్చని ఆయన వివరించారు. పరీక్షలకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలియజేశారు.

# అడవిని తలపిస్తున్న ఎడపల్లి పిహెచ్‌సి

అధికారుల నిర్లక్ష్యంపై సిబ్బంది ఆగ్రహం



**ప్రజాపక్షం/ఎడపల్లి:** ఎడపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెనుక ప్రస్తుతం ఒక చిట్టడవిని తలపిస్తుంది. రోగులకు మెరుగైన వైద్యం అందించాల్సిన చోట పారిశుధ్యం పడకేయడంతో ఆస్పత్రి పరిసరాలు అస్తవ్యస్తంగా మారాయి. గతంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఆస్పత్రి వెనుక భాగంలో వందలాది మొక్కలను నాటారు. అయితే, వాటి సంరక్షణను పంచాయతీ సిబ్బంది గాలికొదిలేశారు. సరైన పోషణ లేకపోవడంతో నాటిన మొక్కల మధ్య పిచ్చి మొక్కలు పెరిగి ఆ ప్రాంతమంతా అడవిలా తయారైంది. ఆస్పత్రి పరిసరాల్లో పేరుకుపోయిన పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలని, పారిశుధ్యం మెరుగుపరిచి మొక్కలను కాపాడాలని పిహెచ్‌సి సిబ్బంది పంచాయతీ అధికారులను కోరుతున్నారు. అంతేగాకుండా వర్షాలు కురిసినప్పుడు ఆస్పత్రి పై కప్పు నుంచి వర్షపు నీరు లీకేజీ అవుతుందని దీని విషయమై ఉన్నతాధికారులకు సైతం విన్నవించామని మండల వైద్యాధికారి డా.వినీత్ రెడ్డి పేర్కొన్నారు. ఇకనైనా సంబంధిత పంచాయతీ అధికారులు స్పందించి ఆస్పత్రి ప్రాంగణాన్ని శుభ్రం చేయించాలని, ఆస్పత్రికి మరమ్మతులు చేయించాలని స్థానికులు ఆస్పత్రి సిబ్బంది కోరుతున్నారు.

# బాలల సంరక్షణ, మహిళా సాధికారత, గ్రామ అభివృద్ధే ధ్యేయం

**ప్రజాపక్షం/దిలావర్ పూర్ :** దిలావర్ పూర్ మండలంలోని సాంగ్వీ గ్రామంలో బాలల సంరక్షణ, మహిళా సాధికారత, గ్రామ అభివృద్ధే ధ్యేయంగా శనివారం బాల,మహిళా గ్రామసభలతో పాటు 2026 27 జిపిడిపి కార్యాచరణ సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. సమావేశంలో బాల్య వివాహాల నిరోధం, పిల్లల హక్కులు, మహిళల సాధికారత, స్వయం ఉపాధి కల్పనపై సుదీర్ఘంగా చర్చించి పలు తీర్మానాలు చేశారు.అలాగే గ్రామానికి వచ్చే నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల ప్రణాళికను జిపిడిపి ద్వారా ఆమోదించారు. ఎంపీఓ గోవర్ధన్ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సందీప్ గౌడ్,పంచాయతీ కార్యదర్శి, ఉపాధ్యాయులు,గ్రామ పెద్దలు,మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 119వ వారం దిగ్విజయంగా

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** పెద్ద హనుమాన్ మందిరంలో ప్రతి శనివారం నిర్వహిస్తున్న సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం శనివారం 119వ వారానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో ద్విజయంగా కొనసాగింది. ఈ సందర్భంగా శ్రీ ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించిన అనంతరం భక్తులు ఏస్వరంతో హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. గతంలో ఈ పారాయణం 118 వ వారానికి చేరినట్లు నమోదై ప్రస్తుతం 119వ వారానికి చేరుకుంది. పారాయణం అనంతరం దేశంలో శాంతి, సుభిక్షం నెలకొనాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని, సకాలంలో వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా జీవించాలని భక్తులు శ్రీ ఆంజనేయ స్వామిని పూజించారు.

# ధర్పల్లి టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రమణరెడ్డి ఎన్నిక

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ధర్పల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా రమణరెడ్డి, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా సంకు రమేష్, టౌన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షునిగా సిరిగాధ సాయికుమార్‌లు ఎంపికైనట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దర్పీ కాంగ్రెస్ పార్టీ యూత్ కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేస్తామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటామని తెలిపారు.

# సర్, రేషన్ కార్డు ఇకెవైసి గడువు పొడగింపు

**ప్రజాపక్షం/జక్రాన్‌పల్లి:** సర్, రేషన్ కార్డు ఈకేవైసీ గడువు ను ప్రభుత్వం పొడగించిందని జక్రాన్‌పల్లి తహసీల్దార్ కిరణ్మయి తెలిపారు. స్పెషల్, ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ను ఈ నెల పదో తేదీ వరకు, రేషన్ కార్డు ఈకేవైసీ ఈ నెల 31వ తేది వరకు తెలంగాణ ప్రభుత్వం పొడిగించినట్లు తహసీల్దార్ కిరణ్మయి తెలిపారు.

# బాదావత్ గోపాల్‌నాయక్ కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** మండలంలోని కారేపల్లి గ్రామానికి చెందిన బాదావత్ గోపాల్‌నాయక్ ఇటీవల పదేపదే కాంగ్రెస్ పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు గాను జిల్లా కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. గోపాల్‌నాయక్‌ను కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు లేఖను విడుదల చేశారు. ఇక మీదట గోపాల్‌నాయక్‌కు కాంగ్రెస్ పార్టీకి ఎటువంటి సంబంధం లేదని లేఖలో తెలిపారు.

# 6 నుంచి సెంట్రల్ ఫర్టిలైజర్ యాప్ అమలు

**ప్రజాపక్షం/ఎడపల్లి:** ఎరువుల పంపిణీ వ్యవస్థను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా మార్చేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ యాప్ ద్వారానే యూరియా, డిఏపి, కాంప్లెక్స్ ఎరువుల విక్రయాలు జరగనున్నాయని, ఎరువులు పొందగోరే రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకొని ఫార్మర్ ఐడి పొందాల్సి ఉంటుందని, కొనుగోలు సమయంలో ఈ ఐడిని చూపించడం తప్పనిసరి అని అన్నారు.

# కదిలి పాపహరేశ్వరాలయాన్ని దర్శించుకున్న ఎల్ఐసి

**ప్రజాపక్షం/దిలావర్‌పూర్ :** నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని అత్యంత ప్రాచీన ప్రాశస్త్యం కలిగిన కదిలి అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీ మాతా అన్నపూర్ణ సమేత శ్రీ పాపహరేశ్వర స్వామివారిని శనివారం భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసి) ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల సీనియర్ డివిజనల్ మేనేజర్ (ఎస్‌డిఎం) పి.శివనాగప్రసాద్ సతీసమేతంగా దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో కుంకుమార్చనలు జరిపి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ విశిష్టతను తెలుసుకొని స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చినట్లు తెలిపారు.

# కాళేశ్వరం రివర్స్ పంపింగ్‌లో మోటార్లు నడపటాన్ని స్వాగతిస్తున్నాం

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** ఇప్పటికైనా కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన రాంపూర్ పంపుహౌస్‌ను ప్రారంభించి వరద కాలువలోకి నీటిని ఎత్తిపోస్తున్నందుకు సంతోషం వ్యక్తం చేస్తున్నామని, ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కూలిపోయిందని, ఉపయోగం లేదని లక్షకోట్ల రూపాయలు వృథా అయ్యాయని కాళేశ్వరం ప్రాజెక్టుపై నిరంతరం దుష్ప్రచారం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వమే నేడు అదే కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన రాంపూర్ పంపుహౌస్ మోటార్లు,స్టార్ట్ చేయటంవారు చేస్తున్న దుష్ప్రచారం అంతా తప్పని తేలిపోయిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యేవేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. రాంపూర్ పంపుహౌస్ మోటార్లను ప్రారంభించి గోదావరి జలాలను ఎస్సారెస్పీ వరద కాలువలోనికి ఎత్తిపోస్తున్నారని, రాంపూర్ పంపుహౌస్ కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమనే విషయాన్ని కాంగ్రెస్ నాయకులు గుర్తించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దూరదృష్టితో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు అవసరాన్ని నేడు ప్రభుత్వ చర్యలే మరోసారి రుజువు చేస్తున్నాయన్నారు. రాంపూర్ పంపుహౌస్ నుండి వరదకాలువ ద్వారా మిడ్ మానేరుకు ఒక టీఎంసీ నీటిని తరలిస్తున్నట్లుగానే వరదకాలువపై ఉన్న రాజేశ్వర్‌రావుపేట పంపుహౌస్‌ను కూడా వెంటనే ప్రారంభించి ఎస్సారెస్పీ వరకు మొత్తం వరద కాలువను పూర్తి నీటితో నింపి తద్వారా వరద కాలువ నుండి చెరువు కూడా నింపాలని ప్రభుత్వాన్ని కోరారు. గత వారం రోజులుగా సమృద్ధిగా కురిసిన వర్షాలకారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి నీటిప్రవాహం పెరిగి ప్రస్తుతం 25 టీఎంసీలకు చేరుకుందని,ఇంకా ఇన్‌ఫ్లో కొనసాగుతున్న నేపథ్యంలో ఎస్సారెస్పీపై ఉన్న లక్ష్మీ లిఫ్ట్,వేంపల్లి లిఫ్ట్, బోడేపల్లి లిఫ్ట్, చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి, గుత్ప,అలీసాగర్ లిఫ్టులన్నింటిని వెంటనే ప్రారంభించి నిజామాబాద్ జిల్లాలోని చెరువులు నింపి రైతాంగానికి నిరంతర సాగునీరందించాలని డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాలే ప్రభుత్వ లక్ష్యంగా ఉండాలని, కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి సామర్థ్యాన్ని వినియోగించి తెలంగాణ రైతాంగానికి సమృద్ధిగా సాగునీరందించే చర్యలు చేపట్టాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కోరారు.

## విశ్వశాంతి స్కూల్‌లో బోనాల పండుగ

**ప్రజాపక్షం /రాయికల్ :** రాయికల్ పట్టణంలోని విశ్వశాంతి స్కూల్‌లో శనివారం బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీలందరూ ఎంతో చక్కగా సాంప్రదాయ దుస్తులు ధరించి అమ్మవారికి బోనం సమర్పించారు .పోతరాజు వేషధారణ లో విద్యార్థులు చేసిన విన్యాసాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నారు.అనంతరం పాఠశాల ప్రిన్సిపల్ మచ్చ గంగాధర్ మాట్లాడుతూ తెలంగాణలో ఆషాఢ మాసంలో మహాకాళి,పోచమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ,అమ్మవార్లకు జరుపుకునే బోనాల పండుగ అత్యంత ముఖ్యమైన రాష్ట్ర పండుగ అని అన్నారు.మహిళలు బోనం తలపై ఎత్తి అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తారని అన్నారు. ఈ వేడుకల్లో పోతరాజుల విన్యాసాలు, డప్పు చప్పుళ్లు ప్రధానంగా ఉంటాయని పిల్లలకు తెలియజేశారు. ఈ బోనాల పండుగ ఆషాఢ మాసం తొలి వారంలో గోల్కొండ కోటలో ప్రారంభమై,సికింద్రాబాద్ లష్కర్ బోనాలు,పాతబస్తీ లాల్ దర్వాజా బోనాలు అత్యంత వైభవంగా జరుగుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు మచ్చ లలిత, విద్యావ్రేష్, ఉపాధ్యాయులు మహేష్ ,రంజిత్, రజిత, సంజన, ఇందుజ, మంజుల, స్రవంతి, కవిత,సాయి హ ర్ష,దీపిక,శివాని, కళ్యాణి, మాలతి, అహల్య, గాయత్రి,గీత రాణి,ప్రవళిక,కావ్య ,ఉషారాణి, పాల్గొన్నారు.

## రాష్ట్ర అథ్లెటిక్స్ మీట్‌కు జశ్వంత్ ఎంపిక

**ప్రజా పక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ స్కూలుకు చెందిన, ఎస్సీ వసతి గృహ విద్యార్థి బి.జశ్వంత్ గత నెల 24న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అండర్–16 జావెలిన్ త్రో విభాగంలో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హై స్కూల్ హెచ్‌ఎం రాజన్న తెలిపారు.విద్యార్థిని తీర్చిదిద్దిన ఫిజికల్ డైరెక్టర్ ఎం.రాజును ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు,గ్రామస్థులు అభినందించారు.

## పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

**ప్రజాపక్షం/ముత్తారం :** గ్రామ ప్రజలు తమ ఇళ్ల,పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల పరిధిలోని పోతారం సర్పంచ్ ఉట్ల చరణ్ పిలుపునిచ్చారు.శనివారం గ్రామంలోని వాడవాడలా డ్రైనేజీలలో పంచాయతీ సిబ్బందితో కలిసి ఆయన బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు.వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

## క్యాబినెట్ హోదా పొందిన ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించిన టిఎన్‌జిఒలు

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** పెద్దపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ను రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్ హోదా కల్పించిన సందర్భంగా,అలాగే పెద్దపల్లి జిల్లా టీఎన్జీఓ భవన నిర్మాణానికి మొదటి విడతగా రూ.10 లక్షలు మంజూరు చేసినందుకు తెలంగాణ నాన్‌గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీఎన్జీఓ), పెద్దపల్లి జిల్లా ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.టీఎన్జీఓ జిల్లా అధ్యక్షులు,ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ బొంకూరి శంకర్ అధ్యక్షతన కార్యదర్శి అయిరెడ్డి సందీప్ రెడ్డి, టీఎన్జీఓ జిల్లా కార్యవర్గ సభ్యులు, వివిధ శాఖల ఉద్యోగ సంఘాలప్రతినిధులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి బ్రాహ్మణ పండితుల త్రయం వేదోచ్చారణతో ఆశీర్వచనాలు అందించి , తదుపరి శాలువ, గజమాల, తలపాగాతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా టీఎన్జీఓ నాయకులు మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే విజయరమణ రావు ఎల్లప్పుడూ సానుకూలంగా స్పందిస్తూ, జిల్లా టీఎన్జీఓ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడం ఉద్యోగులందరికీ ఎంతో ఆనందదాయకమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఉద్యోగుల సంక్షేమం, జిల్లా అభివృద్ధికి ఆయన మరింత సేవలందించాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఉద్యోగుల సంక్షేమం, టీఎన్జీఓ భవన నిర్మాణం కోసం తన వంతు సహకారం ఎల్లప్పుడూ కొనసాగుతుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ అనిత రెడ్డి , ఉపాధ్యక్షులు శ్రీనివాస్, మహేందర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులు ప్రవీణ్, శ్రీధర్, కార్యవర్గ సభ్యులు శిల్పారెడ్డి , స్వప్న, పెద్దపల్లి అర్బన్ యూనిట్ అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, పెద్దపల్లి రూరల్ యూనిట్ కార్యదర్శి ప్రేమ్ సాగర్, సుల్తానాబాద్ యూనిట్ అధ్యక్ష,భాగ్యమ్మ,వెటరినరీ ఫోరమ్ నుండి సయ్యద్ సాధిక్, అశోక్, మల్లికార్జున్, వెంకన్న వివిధ శాఖల ఉద్యోగులు లక్ష్మణ్ ,సంతోష్, రవి,కె శ్రీనివాస్,యు శ్రీనివాస్,అరవింద్,చంద్రశేఖర్, శ్రీనివాస్,శ్రీకాంత్ రెడ్డి,పోలుసాని సాయి, ఓమేష్,అర్జున్,రాజేష్,రాజశేఖర్,ప్రశాంత్, వెంకటేశం,మధుకిరణ్,అరుణ్,ఉద్యోగ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆవులను రోడ్లపై వదిలేస్తే గోశాలకు తరలిస్తాం

### మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రోడ్లపై సంచరిస్తున్న ఆవులను సోమవారం నుండి గోశాలకు తరలిస్తామని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణంలోని రోడ్లపై రాత్రి పగలు అని తేడా లేకుండా రోడ్లపై సంచరిస్తున్న ఆవుల వల్ల వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్న నేపథ్యంలో వాటి యజమానులు సోమవారం లోపు తీసుకువెళ్లాలని లేనియెడల మున్సిపల్ సిబ్బందిచే గోషాలకు తరలించడం జరుగుతుందని,యజమానులు వచ్చిన యెడల ఒక్క ఆవుకు 3000 వేల రూపాయల జరిమానా మరియు గోశాల ఖర్చు నిమిత్తం రోజుకు 300 రూపాయల చొప్పున వసూలు చేయబడుతుందని అన్నారు.ఆవుల యజమానులు వాటిని ఇండ్లలో సంరక్షించుకోవాలని అన్నారు.

## ఎంపిడిఒ కార్యాలయ సూపరింటెంట్ సాదిక్ పాషా బదిలీ

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో సూపరింటెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సాదిక్ పాషా బదిలీ అయ్యారు. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ఆయనను ఓదెల మండలానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.కాగా, కమాన్‌పూర్ ఎంపీడీవో కార్యాలయంలో ప్రస్తుతం సూపరింటెంట్‌గా పనిచేస్తున్న ఎం.సురేష్ ముత్తారం మండలానికి బదిలీపై రానున్నారు.త్వరలోనే ఆయన ఇక్కడ బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం!

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ రాజేంద్రప్రసాద్ తెలిపారు.విద్యుత్ సబ్ స్టేషన్ లో మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

## ప్రభుత్వ ఆస్పత్రులకు ఎన్‌టిపిసి అంబులెన్సులు

**ప్రజాపక్షం/గోదావరిఖని :** కార్పోరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా ఎన్‌టిపిసి రామగుండం సంస్థ గోదావరిఖని, పెద్దపల్లి లోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రులకు రూ.43.50 లక్షల విలువ గల రెండు అంబులెన్స్‌లను విరాళంగా అందించింది. శనివారం ఎన్‌టిపిసిలో సంస్థ రామగుండం ఈ.డి.(ఆర్అండ్‌టి) చందన్ కుమార్ సమంత జెండా ఊపి అంబులెన్స్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ.డి. మాట్లాడుతూ, రోగులను సకాలంలో తరలించేందుకు, అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ఈ అంబులెన్సులు ఎంతగానో ఉపయోగపడ్తాయన్నారు. సమాజ శ్రేయస్సులో భాగంగా ప్రజారోగ్య సంరక్షణకు తమ సంస్థ నిబద్ధతతో సహాయ, సహకారాలను ఎల్లప్పుడూ అందిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్లు, విభాగాధిపతులు, యూనియన్, అసోసియేషన్ ప్రతినిధులు, హెచ్‌ఆర్ బృంద సభ్యులు హాజరయ్యారు.

## హైకోర్టు న్యాయమూర్తికి స్వాగతం

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** హైకోర్టు న్యాయమూర్తి, రాజన్న సిరిసిల్ల పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ ఎన్ తుకారాంజీ నీ జిల్లా ఇంచార్జి ప్రధాన న్యాయమూర్తి, జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి బి.పుష్పలత, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే శనివారం స్వాగతం పలికారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆయనకు సిరిసిల్ల పట్టణంలోని పంచాయతీ రాజ్ అతిథి గృహంలో పుష్పగుచ్చాలు అందజేసి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి రాధిక జైస్వాల్, సిరిసిల్ల, వేములవాడ సీనియర్ సివిల్ న్యాయమూర్తులు పి.లక్ష్మణాచారి, అజయ్ కుమార్ జాదవ్, సిరిసిల్ల జూనియర్ సివిల్ జడ్జి జి.మేఘన, ఆర్డీఓ శ్రీధర్ బాబు, డీఎస్పీ నాగేంద్రచారి చారి, తహసీల్దార్ మహేష్, తదితరులు ఉన్నారు.

## గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

**ప్రజాపక్షం/ఎడపల్లి:** ఎడపల్లి మండల పరిధిలోని బాపు నగర్ గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో షీటీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీటీమ్ అధికారులు మాట్లాడుతూ.. చిన్నతనంలో పిల్లలు తమకు జరిగే అనుచిత ప్రవర్తనను గుర్తించగలగాలని, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ల మధ్య ఉన్న తేడాను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. ఎవరైనా అనుమానాస్పదంగా ప్రవర్తించినా, ఇబ్బంది పెట్టినా తాకడానికి ప్రయత్నించినా వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు లేదా ఉచిత హెల్ప్ లైన్ నంబర్ల ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని స్పష్టం చేశారు. అంతేగాకుండా, రోడ్డు ప్రమాదాల నివారణలో పిల్లలు కూడ భాగస్వాములు కావాలని అధికారులు కోరారు. ఇళ్ల వద్ద తల్లిదండ్రులు, ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా పిల్లలే వారికి సూచించాలని, అలాగే కార్లు నడిపేటప్పుడు సీట్ బెల్ట్ పెట్టుకునేలా గుర్తు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, షీటీమ్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వొకేషనల్ కాలేజీలో ముందస్తు ఫ్రెండ్షిప్ డే వేడుకలు

**ప్రజాపక్షం / జమ్మికుంట :** ఆగస్టు మొదటి ఆదివారం జరుపుకునే ఫ్రెండ్షిప్ డేను పురస్కరించుకొని జమ్మికుంట వొకేషనల్ కళాశాలలో శనివారం ముందస్తుగా స్నేహితుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల చైర్మన్, ప్రిన్సిపాల్ షేక్ అబ్దుల్లా, అన్నబోయిన రాజేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలను విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ విద్యావేత్త మహమ్మద్ అంకూష్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కళాశాల అధ్యాపకులు సమ్మయ్య, సతీష్, అనిల్, రాజ్ కుమార్, మౌనికతోపాటు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా వేడుకలను జరుపుకున్నారు. స్నేహబంధాన్ని మరింత బలోపేతం చేసుకుంటూ పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు

**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ :** ప్రపంచ తల్లి పాల వారోత్సవాలలో భాగంగా తల్లి, శిశు ఆరోగ్యాన్ని ప్రోత్సహించేందుకు కరీంనగర్ లయన్స్ క్లబ్ ప్రభుత్వ మాతా శిశు ఆసుపత్రిలో పాలిచ్చే తల్లుల కోసం ప్రోటీన్ పౌడర్ పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా 35వ డివిజన్ కార్పోరేటర్ సాదవేణి సుజాత హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. డా.విజయ రేకులపల్లి గౌరవ అతిథిగా హాజరయ్యారు. పాలిచ్చే తల్లులకు 200 ప్రోటీన్ పౌడర్ బాక్సులను పంపిణీ చేశారు. నవజాత శిశువుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు కేవలం తల్లి పాలు మాత్రమే పట్టడం, సమతుల్య పోషణ, సరైన మాతృ సంరక్షణ ప్రాముఖ్యతను వైద్యులు నొక్కి చెప్పారు. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు గుడ్డ సంచులను పంపిణీ చేశారు. గజవాడ రాధాకృష్ణ, గజవాడ ప్రభు, అధ్యక్షులు మ్యాదం శివకాంత్, కార్యదర్శి బట్టు వినోద్, కోశాధికారి మేతుకు కృష్ణచైతన్య, ముక్క శరత్ కృష్ణ, కంభం ప్రసాద్, ఐత సూరజ్, క్లబ్ సభ్యులు, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## మృత పారిశుద్ధ్య కార్మికుడి కుటుంబానికి చైర్మన్ చేయూత

**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** మెట్‌పల్లి పురపాలక సంఘంలో పారిశుధ్య కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న కాంపెల్లి పోచయ్య (57) ప్రమాదవశాత్తు కోనేరులో పడి మృతి చెందడం పట్ల మున్సిపల్ చైర్మన్ మైలారం లింబాద్రి తీవ్ర విచారం వ్యక్తం చేశారు.మృతుడి కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని తెలుసుకున్న చైర్మన్ మైలారం లింబాద్రి మానవతా దృక్పథంతో తన సొంత నిధుల నుంచి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని మృతుడి భార్య లక్ష్మికి శనివారం అందజేశారు. పోచయ్య అకాల మరణం మున్సిపాలిటీకి, ఆయన కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని చైర్మన్ భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, మున్సిపల్ కమిషనర్ డి. శ్రీనివాస్ గౌడ్,కౌన్సిలర్లు గుడికందుల అజయ్,బోడ్డ ఆనంద్,ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మైలారపు రాంబాబు,నాయకులు బర్ల సూరి,పుదుకారం కిషోర్,మున్సిపల్ అధికారులు,సిబ్బంది,పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.